ధర్మవరం చెరువు పక్కనే కేతిరెడ్డి విలాసవంతమైన ఫాంహౌస్





గుర్రాల కోటను.. కొట్టేదెన్నడు..?

నోటీసులతో సరిపెడుతున్న యంత్రాంగం
కేతిరెడ్డి ఆక్రమణలపై చర్యలకు మీనమేషాలు
కూటమి నేతల అనైక్యతే కారణమనే విమర్శలు

పుట్టపర్తి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కేతిరెడ్డి గుర్రాల కోటపై చర్యలు మొక్కుబడిగానే కనిపిస్తున్నాయి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చెరువు, అసైన్డ్, ప్రభుత్వ భూములను కలిపేసుకుని గుర్రాల కోటను నిర్మించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అసైన్డ్ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నందుకు కేతిరెడ్డి మరదలు గాలి వసుమతికి అధికారులు నోటీసులు కూడా ఇచ్చారు. ధర్మవరం-పుట్టపర్తి ప్రధాన రహదారి పక్కన.. క్రియాశక్తి వడయార్ చెరువు పక్కనే గుర్రాల కోటను కేతిరెడ్డి నిర్మించారు. విలాసవంతమైన ఫామ్‌హౌస్ ఏర్పాటు చేసుకున్నారు. ధర్మవరంలో ఈ ప్రాంతాన్ని గుర్రాల కోట అని, మరో రుషికొండ అని పిలుస్తుంటారు. కేతిరెడ్డి గుర్రాల కోట వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశం అయింది. లోకేశ్ పాదయాత్ర సమయంలో సైతం ఈ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. అధికారం చేపట్టాక కేతిరెడ్డి భూ అక్రమాలను నిగ్గు తేల్చే దిశగా చర్యలు చేపట్టింది. తాజాగా గుర్రాల కోటపై కేతిరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో గాలి వసుమతి పేరిట 2.42 ఎకరాల అసైన్డ్ భూమి రిజిస్టర్ అయినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఈ భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.



కేతిరెడ్డి

అంతా మొక్కుబడే..

వైసీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి భూ ఆక్రమణలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. క్రియాశక్తి ఒడయార్ చెరువు ఆక్రమణను జలవనరుల శాఖ నిర్ధారించింది. ధర్మవరం రెవెన్యూ పొలంలోని ఎర్రగుట్ట 908, 909, 910, 616-1 సర్వే నంబర్లలో చెరువు స్థలం 20.61 ఎకరాల వరకు ఆక్రమించినట్లు వారు గుర్తించారు. గత ఏడాది నవంబరు 5న జలవనరులు శాఖ గాలి వసుమతికి నోటీసులు జారీ చేసింది. వారంలో రోజుల్లో ఖాళీ చేయాలని ఆదేశించింది. సర్వే నంబర్ 908లో 9.30 ఎకరాలు, 909లో 7.90, 910లో 2.50 ఎకరాలు ఆక్రమించుకుని, చుట్టూ ఇనుప కంచెవేశారు. ఆ భూముల్లో నారింజ, మహాగని మొక్కలను పెంచారు. 661-1 సర్వే నంబరులో 91 సెంట్లు ఆక్రమించి, టెంకాయచెట్లు సాగు చేశారు. ఈ వివరాలను నోటీసుల్లో పొందుపరిచి, వారంలోగా ఖాళీ చేయాలని ఆదేశించారు. లేదంటే తామే స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. అంతటితో సరిపెట్టారు. కోర్టుకు వెళ్లారని సాకుచూపిస్తున్నారు. ఇప్పుడు అసైన్డ్ భూమి 2.42 ఎకరాల విషయంలో నోటీసుల పేరిట హడావుడి చేస్తున్నారు.

ఒట్టి మాటలేనా..?

2023 ఏప్రిల్‌లో నారా లోకేశ్ యువగళం పాదయాత్ర ధర్మవరం మీదుగా సాగింది. ఆ సమయంలో కేతిరెడ్డి గుర్రాల కోట గురించి ప్రస్తావించారు. ఆ సమయంలో తాను భూములు ఆక్రమించలేదని, ఆక్రమణలను నిరూపించాలని రాజధానిలో చంద్రబాబు నివాసం ఉంటున్న ప్రాంతానికి వెళ్లి కేతిరెడ్డి సవాలు విసిరారు. మరుసటి రోజే చెరువు కబ్జా గురించి గూగుల్ మ్యాప్ సహా ఆధారాలతో నారా లోకేశ్ విడుదల చేశారు. దీంతో కేతిరెడ్డి మౌనం వహించారు. అధికారంలోకి వచ్చాక కోటను బద్దలు కొడతామన్న మాటలు ఆచణలో సాధ్యం కావడం లేదు. ధర్మవరంలో కూటమి పార్టీల మూడు ముక్కలాటే దీనికి కారణమన్న విమర్శలు వస్తున్నాయి. గుర్రాలకోట విషయంలో జరిగే ప్రతి పరిణామం గురించి కేతిరెడ్డికి కొందరు అధికారులే ఉప్పందిస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

నోటీసులతో సరి..

క్రియాశక్తి ఒడయార్ చెరువు ఆక్రమణకు గురైనట్లు జలవనరుల శాఖ అధికారులు గుర్తించారు. గత ఏడాది నవంబరులో కేతిరెడ్డికి నోటీసులు జారీ చేశారు. ఆక్రమించిన చెరువు భూములను స్వాధీనం చేయాలని ఆదేశించారు. ఆ తరువాత ఎలాంటి చర్యలూ లేవు. తాజాగా కేతిరెడ్డి సోదరుడి భార్య వసుమతికి కూడా రెవెన్యూ అధికారులు పోస్టులో నోటీసులు పంపారు. అవి తిరుగుటపా కట్టడంతో వ్యక్తిగతంగా నోటీసులు ఇచ్చేందుకు వెళ్లారు. అయినా ఆమె అందుబాటులోకి రాలేదని సమాచారం. దీంతో ఈ అంశంపైనా కదలిక ఉంటుందా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. అధికార యంత్రాంగం నోటీసులతో సరిపెట్టి, చర్యలకు మీనామేషాలు లెక్కిస్తోందనే విమర్శలు వస్తున్నాయి. కేతిరెడ్డి అక్రమాల గుర్రాల కోటను బద్దలు కొడతామని టీడీపీ సహా కూటమి పార్టీల నేతలు పలు సందర్భాల్లో బహిరంగ ప్రకటనలు చేశారు. ఎప్పుడు ఆచరణలో పెడతారనే చర్చ జరుగుతోంది.

నేటికీ జీ హుజూర్..!

ప్రభుత్వ కార్యాలయాల్లో వైసీపీ నాయకులదే హవా
వీరవిధేయులుగా కొందరు అధికారులు
ఆవేదన వ్యక్తం చేస్తున్న తెలుగుతమ్ముళ్లు



హిందూపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతృత్వంలోని ప్రభుత్వం దిగిపోయి దాదాపు ఏడాది కావస్తున్నా చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో నేటికీ ఆ పార్టీ నాయకుల మాటే చెల్లుబాటు అవుతున్నట్లు సమాచారం. కొంతమంది అధికారులు వైసీపీకి వీరవిధేయులుగా ఉంటూ అడిగిన పనిచేసి పెడుతున్నట్లు తెలిసింది. బయటి నుంచి బదిలీపై వచ్చిన వారు కూడా వైసీపీ నాయకుల మాటకు జీ హుజూర్ అంటున్నట్లు అధికార పార్టీ నాయకులు వాపోతున్నారు. ఒక నియోజకవర్గంలోనే కాదు జిల్లా అంతటా ఇదే పరిస్థితి ఉందని అన్ని శాఖల్లోనూ ఇలాంటి విధేయులున్నారని ఆశాఖలో పనిచేసే అధికారులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎంతో ఇబ్బంది పడ్డామని, ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నామని, ఎంతో నష్టంకూడా జరిగిందని ఇప్పటికీ వారిమాటే చెల్లుబాటు అవుతుండటంతో ఏమిటని పలువురు టీడీపీ నాయకులు ఆవేదనతో ప్రశ్నిస్తున్నారు.

ఉదాహరణకు..

గత నెలలో వైసీపీకి చెందిన ఓ స్థానిక ప్రజాప్రతినిధి హిందూపురంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి సిబ్బంది కూర్చునే కుర్చీలో కూర్చుని దర్జాగా తనపని కానిచ్చుకున్నాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆ నాయకుడికి తెలుగుదేశం పార్టీలో ద్వితీయ శ్రేణి నాయకుల అండ ఉన్నట్లు సమాచారం. మునిసిపల్ కార్యాలయంలో సైతం కొంతమంది వైసీపీ నాయకుల పనులు నిరాటంకంగా సాగుతున్నాయి. ఇందుకు కొంతమంది టీడీపీ నాయకుల అండ ఉన్నట్లు సమాచారం.

- చిలమత్తూరు మండలంలో తెలుగుదేశంపార్టీలోని కొంతమంది నాయకులు వైసీపీ నాయకులకు వంతు పాడుతూ పరోక్షంగా సహకరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.
- హిందూపురం మండలంలో ఓ భూమికి సంబంధించిన పనిని చిలమత్తూరు మండలానికి చెందిన వైసీపీ నాయకుడు చక్కబెట్టారు. అయితే ఆ వైసీపీ నాయకుడికి బీజేపీ నాయకుల అండ ఉన్నట్లు సమాచారం. దీంతోపాటు చిలమత్తూరు మండలంలో భూమికి సంబంధించిన వ్యవహారాలు వైసీపీ నాయకులు చక్కబెట్టడంలో జనసేన, బీజేపీ నాయకులు అండ ఉన్నట్లు తెలిసింది.
- పెనుకొండ నియోజకవర్గంలో ఇతర ప్రాంతాలు, వేరే జిల్లాలకు సంబంధించి జనసేన, బీజేపీ నాయకులకు సంబంధించిన పనులను వైసీపీ నాయకులు చక్కబెడుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులకు తెలియకుండానే వ్యవహారాలు సజావుగా సాగిపోతున్నాయి.

అప్పట్లో అలా..

వైసీపీ పాలనలో ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులకు ఏ ఒక్క పనీ జరగలేదు. ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్‌కు ధైర్యంగా వెళ్లలేని పరిస్థితి. సొంత పనిని కూడా వైసీపీ నాయకులను బతిమాలుకుని చేయించుకున్న సంఘటనలు ఆ ఐదేళ్లలో ఎన్నో ఉన్నాయి. ఎవరైనా తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు ప్రభుత్వ కార్యాలయాల్లోకాని, పోలీస్ స్టేషన్‌లోగాని వెళ్తే సంబంధిత నియోజకవర్గ ఇన్‌చార్జ్‌కు తక్షణమే సమాచారం చేరేది. దీంతో వెంటనే వారు సంబంధిత అధికారులకు ఫోన్‌చేసి ప్రశ్నించేవారు. దీంతో ఎందుకొచ్చిన గొడవని టీడీపీ నాయకుల్ని కార్యాలయాలకు రావద్దని ఆయా అధికారులు చెప్పిన సందర్భాలు చాలా ఉన్నాయి.

మథనపడుతున్న తెలుగు తమ్ముళ్లు



జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో వైసీపీ నాయకుల మాటే చెలుబాటు అవుతుండటంతో తెలుగుతమ్ముళ్లు మథన పడుతున్నారు. కూటమి పార్టీల్లోని నాయకులు వైసీపీ వారికి పరోక్షంగా సహకరించడాన్ని తమ్ముళ్లు జీర్ణించుకోలేకపోతున్నారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు అధికారులకు గట్టి ఆదేశాలు ఇచ్చి, వైసీపీ నాయకుల హవాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. అలా చేయకుంటే వైసీపీ నాయకులు ఆర్థిక అక్రమాల ద్వారా ఆర్జించిన సొమ్ముతో వచ్చే ఎన్నికల్లో తమను దెబ్బతీస్తారని తెలుగుతమ్ముళ్లు ఆందోళన చెందుతున్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేయండి

- కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో పదివేల సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేయడానికి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో శుక్రవారం ఆయన జేసీ అభిషేక్‌కుమార్‌తో కలిసి జిల్లాలోని నియోజక వర్గాల అభివృద్ధిపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పించి, ప్రతి ఇంటిపై సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయించాలని సూచించారు. ఈసోలార్ యూనిట్ల ఏర్పాటు వల్ల ప్రజలకు అనేక ప్రయోజనాలు కలుగు తాయన్నారు. నియోజకవర్గ ప్రణాళిక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఈకమిటీలో ఐదుగురు నిపుణులు ఉండాలన్నారు. వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాలతోపాటు సచివాలయాల్లో వాట్సాప్ గర్నమెంటు పరిపాలనపై ప్రచార పోస్టర్లు ఏర్పాటు చేయాల న్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు సువర్ణ, మహేష్, వీవీఎస్ శర్మ, ఆనంద్, జిల్లా విద్యుత్‌శాఖ ఎస్‌ఈ సురేంద్ర, డీపీఓ సమత, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, సీపీఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన కల్పించాలి: ఎస్పీ

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): శక్తి యాప్‌పై జిల్లాలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఎస్పీ రత్న పోలీసు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. దీంతో శక్తి టీం జిల్లా నోడల్ అధికారి, మహిళా పీఎస్ డీఎస్పీ ఆదినారాయణ పర్యవేక్షణలో ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ప్రధాన కూడళ్లలో శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమాలను శుక్రవారం ప్రారంభించారు. జిల్లా కేంద్రంలో డీఎస్పీ మాట్లాడుతూ.. శక్తి యాప్ మహిళలకు అత్యవసర సమయాల్లో ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. తక్షణ సాయం అందించే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం మహిళల సెల్‌ఫోన్‌లలో యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించారు.



బస్టాండులో శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీసులు

ఎంపీపీపై కేసు నమోదు



అమరనాథ్ రెడ్డి

కదిరి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ తోట అమరనాథ్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. అనంతపురం నగరంలోని ఎస్‌ఆర్‌ఐ కళాశాలకు చెందిన వెన్నపూస విశ్వనాథరెడ్డి ఏడాదిన్నర క్రితం అమరనాథ్‌రెడ్డి వద్ద వ్యక్తిగత అవసరాల కోసం కొంత మొత్తం అప్పు తీసుకున్నాడని, తిరిగి చెల్లించినా వడ్డీకోసం వేధిస్తున్నాడని బాధితుడు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వడ్డీ సొమ్ముకోసం చెక్కులు కూడా ఇచ్చానని, అయినా తన ఇంటి వద్దకు వచ్చి కుటుంబ సభ్యులను బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

పరికి షామీర్‌పై..

కదిరి పట్టణానికి చెందిన వైసీపీ నాయకుడు పరికి షామీర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. గతనెల 24న వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ గురించి షామీర్ అనుచితంగా మాట్లాడారని, ఈ మేరకు టీడీపీ 15వ వార్డు ఇన్‌చార్జి హైదర్ వలి ఫిర్యాదు చేశారని సీఐ తెలిపారు. రెండు పార్టీల మధ్య గొడవలు జరిగేలా రెచ్చగొట్టిన షామీర్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారని వెల్లడించారు.

గ్రామాల్లో అభివృద్ధి బాటలు: మంత్రి సవిత



సీసీ రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి సవిత

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఏళ్లుగా మట్టిరోడ్లే ఉన్న గ్రామాల్లో సైతం సిమెంటు రోడ్లు వేస్తున్నామని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. పెనుకొండ, రొద్దం మండలాల్లో శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి ప్రారంభించారు. పెనుకొండ మండలం నాగలూరు గ్రామంలో జలజీవన్ మిషన్ కింద నూతన బోరుబావికి భూమిపూజ చేశారు. అనంతరం రూ.1.05 కోట్లతో పూర్తయిన సీసీ రోడ్డును ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రజల ఆశలు నెరవేర్చే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ, ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న గ్రామీణ రహదారులను సైతం నిర్మిస్తున్నామన్నారు. త్వరలోనే పెనుకొండ, రొద్దం, తదితర ప్రాంతాల్లో మహిళల ఉపాధి కోసం గార్మెంట్స్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామన్నారు. స్థల పరిశీలన చేపడుతున్నామన్నారు. అనంతరం రొద్దం మండలంలో పెన్నానదిపై రూ.2.8 కోట్లతో వంతెన నిర్మాణానికి భూమి పూజ చేశారు. డీఆర్ కొట్టాల నుంచి దొడగట్ట వరకు రూ.1.30కోట్లతో సీసీ రోడ్డుకు భూమి పూజ చేశారు. తురకలాపట్నం గ్రామ చెరువులో జలహారతి ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ నారాయణస్వామి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, మండల కన్వీనర్ సిద్దయ్య పాల్గొన్నారు.

24వేల జవాబు పత్రాల మూల్యాంకనం

జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు మూల్యాంకనం

కొత్తచెరువు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం కొనసాగుతోంది. రెండో రోజు శుక్రవారం స్థానిక నిర్వహించారు. ఇందులో ఒకేషనల్, రెగ్యులర్ 24వేల జవాబు పత్రాలను మూల్యాంకనం చేశారని డీఈఓ కిష్టప్ప తెలిపారు.

చెల్లికి సమాధానం చెప్పి.. రా..!

జగన్‌కు కందికుంట సవాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): చెల్లి సునీతకు సమాధానం చెప్పి.. ఆ తరువాత వైసీపీ అధ్యక్షుడు జగనమ్మోహన్‌రెడ్డి రామగిరికి రావాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సవాల్ విసిరారు. స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రామగిరిలో వ్యక్తిగత తగాదాల నేపథ్యంలో జరిగిన హత్యను కుల, రాజకీయ హత్యగా పేర్కొనడం జగన్ కుట్రపూరితతనానికి నిదర్శనమన్నారు. రామగిరికి వచ్చే ముందు చిన్నాన్న వివేకానందరెడ్డి ఎలా చనిపోయాడో ఆయన కూతురు సునీతకు సమాధానం చెప్పాలన్నారు. జగన్‌కు మానవత్వం ఉంటే మొదట వివేకానందరెడ్డి హత్యను తేల్చాలని డిమాండ్ చేసేవాడని అన్నారు. ఆ కేసులో సాక్షులు ఒక్కొక్కరుగా చనిపోతున్నారనీ, వాటి వెనుక జగన్ హస్తం ఉన్నట్లు తనకు అనుమానం ఉందని ఆరోపించారు. సునీతకు కూడా దీనిపై అనుమానం ఉందన్నారు. ప్రొద్దుటూరులో చేనేత వర్గానికి చెందిన వ్యక్తిని హత్య చేసినపుడు, చంద్రయ్యను చంపినపుడు హత్యారాజకీయాలు జగన్‌కు గుర్తు రాలేదా అని కందికుంట నిలదీశారు. వీటన్నింటికి సమాధానం చెప్పి, రామగిరికి రావాలని కోరారు. సమావేశంలో టీడీపీ నాయకులు డైమండ్ ఇర్ఫాన్, కొమ్మినేని గంగయ్యనాయుడు, కొయ్య రాజేంద్రనాయుడు, కలాం పాల్గొన్నారు.

కళావరింత ఏదీ..?

మాయమవుతున్న నాటక రంగం

- అంతరించిపోతున్న బయలు నాటకాలు
- గతమెంతో ఘనం
- ప్రదర్శన అంటే ఊరంతా పండగే..!



సుందోప సుందర నాటకంలో పాత్రధారి

బొమ్మనహాళ్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం అనేక గ్రామీణ కళలను మృత్యు ఒడికి చేర్చుతూ వస్తోంది. పల్లె ప్రజలకు వినోదం పంచిన రంగుల కళలు వెలిసిపోతున్నాయి. ఎందరికో ఉపాధి, గుర్తింపు తెచ్చిన గ్రామీణ కళలు అంతరించిపోతున్నాయి. అలాంటిదే బయలు నాటకం. గ్రామీణ ప్రజలకు ఒకప్పుడు ఎంతో వినోదం పంచిన ఈ కళ ఆదరణ కొరవడి కునారిల్లుతోంది. కర్నాటక సరిహద్దులో ఉన్న బొమ్మనహాళ్, డీ.హీరేహాళ్, కణేకల్లు మండలాల్లో బయలునాటకల ప్రదర్శనలు ఎక్కువగా జరుగుతుండేవి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఏటా పండుగ వేళాల్లో నిర్వహిస్తుండేవారు. ఈ ప్రాంతాలలో నాటక ప్రదర్శనలు కన్నడ భాషలోనే సాగేవి. ఆశ్వమేధ యాగం, అభిమన్యుని పరాక్రమం, సుందోప సుందర, పాండువిజయ మొదలైన కథాంశాలను ఎక్కువగా ప్రదర్శించేవారు. నాటకాలు ఎప్పుడెప్పుడు వస్తాయా అని ఎదురు చూసిన వారు, నాటక ప్రదర్శన పట్ల ఆసక్తి కనబరిచేవారు రానురాను కనుమరుగయిపోయారు.

మొత్తం అద్దె సామగ్రినే

ఈ నాటక ప్రదర్శనలోని మరో ముఖ్య అంశం వేషధారణ. చెళ్లకెర, బళ్లారి ప్రాంతాలకు చెందిన డ్రస్సింగ్ కంపెనీవారు వేషధారణకు అవసరమైన సరంజామా సరఫరా చేస్తారు. వేషానికి కావాల్సిన డ్రస్సులు, ఆభరణాలు మొత్తం వీరు అద్దెకు ఇస్తారు. ఒక్కొక్క ప్రదర్శనకు రూ. 20 వేల నుంచి రూ. 30 వేల వరకు అద్దె వసూలు చేస్తుంటారు. గురువు వద్ద 3, 4 నెలలు శిక్షణ పొందిన తర్వాత నాటక ప్రదర్శన చేస్తారు. రాత్రి 9 గంటలకు ప్రారంభమైన ప్రదర్శన తెల్లవారేంత వరకు ఉంటుంది.

గ్రామంలోని వారే జట్టుగా...

ఏదైనా గ్రామంలోని పెద్దలు, యువకులు ఓ బృందంగా ఏర్పడి ఈ బయలనాటక ప్రదర్శనకు శ్రీకారం చుడతారు. నాటకం నేర్చుకోవడానికి ఓ గురువును నియమించుకుంటారు. ప్రతి రోజూ రాత్రివేళలలో 3, 4 గంటలు పాటు శిక్షణ పొందుతారు. పగటి సమయంలో తమ పనులలో నిమగ్నమైనవారు రాత్రి నేర్చుకున్న డైలాగులు, పద్యాలు చెప్పుకుంటూ తమ పనులను ఉత్సాహంగా చేస్తుంటారు. ఒక నాటకంలో 10 నుంచి 12 మంది వరకు పాత్రధారులుంటారు. అన్ని పురుషపాత్రలే ఉంటాయి. రెండు, మూడు స్త్రీ పాత్రధారులను ఇతర ప్రాంతాల నుంచి పిలిపించుకుంటారు. వారిని రాణులు అని పిలుస్తుంటారు. వీరు నాటక ప్రదర్శనలే వృత్తిగా చేసుకొని బయలునాటకాల ప్రదర్శనలు చేస్తుంటా రు. వీరు ఒక నాటకానికి రూ. 20 వేల నుంచి రూ. 30 వేల వరకు తీసుకుంటారు. ప్రతి నాటక ఘట్టాన్ని పూర్తిగా నేర్చుకుని ఉంటారు.

ఊరంతా పండగే

ప్రదర్శన రోజు ఊరంతా పండగ వాతావరణం నెలకొంటుంది. ప్రతి పాత్రధారుడు తన బంధువర్గానంతటిని ఇంటికి పిలిపించుకుంటాడు. విందు భోజనాలు ఏర్పాటు చేస్తాడు. ఉదయం నుంచే రంగస్థల అలంకరణ ప్రారంభమవుతుంది. చీకటి పడేవేళకు గ్రామమంతా రంగస్థలం ముందు చేరుకుంటుంది. కరెంటు దీపాల వెలుగులో రంగు రంగుల దుస్తులతో ప్రేక్షకుల మధ్య నుంచి తప్పెట్లమోతకు అను గుణంగా చిందులు వేస్తూ పాత్రధారులు రంగస్థలంపైకి వస్తుంటారు. ప్రతి డైలాగును గట్టిగా ఉచ్చరిస్తూ చేతిలోని ఆయుధాన్ని తిప్పుతూ డైలాగులు చెబుతూ ప్రేక్షకులకు వినోదాన్ని కలిగిస్తుంటారు. పాత్రధారులతో కలిసి ఫొటోలు దిగడం, బహుమతులు ఇవ్వడం ఓ సరదా. ఇలాంటి అపూరూపమైన నాటక ప్రదర్శనలు ఈ మధ్య పూర్తిగా కనుమరుగవుతున్నాయి. వీటికి కారణం ఆర్థికంగా గ్రామీణ ప్రాంత ప్రజలు భరించలేకపోవడం. ఇప్పటి యువత వీటిపై పెద్దగా ఆసక్తి చూపకపోవడం ఓ కారణం. అప్పట్లో నాటక ప్రదర్శన మొత్తం ఖర్చు రూ. 20 వేల నుంచి రూ. 30 వేల వరకు వచ్చేది. ప్రస్తుతం అదే నాటక ఖర్చు రూ. 1 లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు అవుతుందని అంటున్నారు.

వర్షాల కోసం..

వర్షాలు కురవని సమయంలో బయలు నాటకాలు ఆడితే మంచి వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండేవని ప్రజల నమ్మకం. నేడు వర్షాలు రాకపోయినా ఆర్థికంగా స్థిమితంగా లేకపోవడంతో బయల నాటకాల జోలికి వెళ్లడం లేదు. కనుమరుగవుతున్న నాటక ప్రదర్శనలు పదికాలాల పాటు నిలిపేందుకు ప్రభుత్వాలు, ఔత్సాహికులు చొరవ చూపాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

టైరు బండే వేదిక

బయలు నాటక ప్రదర్శనకు టైరు బండినే వేదికగా ఉపయోగించేవారు. రెండు చక్రాలను తీసివేసి ఆ టైర్ల బండను ఒకదాని పక్కన ఒకటి పెట్టి దానిపై నుండి పౌరాణిక కథలను ప్రదర్శించేవారు. చాలా చక్కటి సంభాషణలతో, వేషాలతో చూపరులను ఆకట్టుకునేవారు. ఇప్పుడు ఎప్పుడైన నాటక ప్రదర్శన చేసేవారు చెక్క పలకలను అద్దెకు తెచ్చి రంగస్థలం వేదికను ఏర్పాటు చేస్తారు. ఆ వేదికపై మైకులు ఏర్పాటు చేసి డైలాగులను చెబుతారు. నాడు మైకులు కూడా ఉండేవి కావు. వారి కంఠ స్వరంతోనే డైలాగులు చెప్పేవారు.



వినోదంలా ఉండేది

అప్పుడు బయలాటలంటే గ్రామాల్లో ఒక వినోదం. బయలాట ఆడేందుకు పాత్రధారులు ఎంతో ఉత్సాహం చూపేవారు. కాలక్రమేనా ఖర్చులు పెరగడం, వాటిపై ఆసక్తి లేకుండా డ్రామాలు వైపు మళ్లడం బైలాటాలు కనుమరుగయ్యాయి. నేను గతంలో శ్రీకృష్ణ, దుర్యోధన, కర్ణ పాత్రలతో పాటు బయలాటలు ఆడా. మేనేజర్‌గా ఉండి బయలాటలు ఆడించా. ఇప్పుడు పెద్దగా ఆసక్తి కనబరిచేవారు లేరు.

- లోకనాథ్‌రెడ్డి, శ్రీధరఘట్ట



దేవాలయం తరపున ఆడిస్తున్నాం

మా గ్రామంలో శ్రీనరసింహస్వామి జలధి జాతర మహోత్సవం రోజున ప్రతి ఏటా బయలాటలు ఆడేవారు. మాస్టారు కథ, రామాయణం నాటకాలు ఎక్కువగా ఆడేవారు. ఖర్చులు పెరగడం వల్ల ఆడకుండా స్వామి వారి జలధి మహోత్సవం రోజున ప్రతి ఏటా వేరే గ్రామాలకు చెందిన వారితో బయలాటలు దేవాలయం తరపున ఆడిస్తున్నాం. ఇక్కడ వారు ఎక్కువగా ఆసక్తి చూపకపోవడంతో రాత్రంతా ప్రజలకు వినోదం కోసం ఇతర గ్రామాలకు చెందిన వారిని పిలిపించి కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

- ఓబుళస్వామి, ఉప్పరహాళ్

కొత్త సేద్యగాళ్లు అద్వితీయం

రాయలసీమ నాటక రచనా పోటీల ఫలితాలు విడుదల


దామోదర్‌రెడ్డి

అనంతపురం కల్చరల్/ సెంట్రల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాయలసీమ నాటక రచనా పోటీల ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. సీనియర్ రచయిత, రాయలసీమ ఉద్యమనేత డాక్టర్ ఎంవీ రమణారెడ్డి స్మారకార్థం రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఇటీవల రాయలసీమ నాటక రచనా పోటీలు నిర్వహించారు. విజేతల వివరాలను ఆ వేదిక సమన్వయకర్త డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి శుక్రవారం వెల్లడించారు. ఈ పోటీలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు రచయితలు నాటక రచనలను పంపారు. తిరుపతికి చెందిన వీఆర్ రాసాని రచించిన 'దేవర మాన్యం' రచనకు ప్రథమ బహుమతి దక్కింది. అనంతపురానికి చెందిన డాక్టర్ పామిరెడ్డి దామోదర్‌రెడ్డి రచించిన 'కొత్త సేద్యగాళ్లు' రచనకు ద్వితీయ బహుమతి వచ్చింది. తృతీయ బహుమతికి హైదరాబాద్‌కు చెందిన పాణ్యం దత్తశర్మ రచించిన 'నల్లకాలర్' హిందూపురానికి చెందిన శాంతి జయప్రకాష్ రచించిన 'సమిధలు', కళ్యాణదుర్గానికి చెందిన 'పరివర్తన' నాటకాలు ఎంపికయ్యాయన్నారు. అలాగే ప్రత్యేక బహుమతుల కింద ఏలూరు జిల్లా వెంకట నాగేంద్ర మాగంటి రచించిన 'వేట కొడవలి', కర్నూలుకు చెందిన పర్వతయ్య రచించిన 'చిన్నారి రేఖ', విశాఖపట్నానికి చెందిన పీవీ శేషారత్నం రచించిన 'విజేత', చెన్నైకు చెందిన చతుర్వేదుల చెంచు సుబ్బయ్యశర్మ రచించిన 'సఖ్యత' నాటకాలు ఎంపికయ్యాయన్నారు. వీరందరికీ రూ.20 వేలు నగదు బహుమతిని ఆన్‌లైన్ ద్వారా చెల్లించినట్లు తెలిపారు. కాగా పోటీల్లో తన 'కొత్త సేద్యగాళ్ళు' నాటక రచనకు ద్వితీయ బహుమతి లభించడం ఆనందంగా ఉందని ప్రముఖ కవి, రచయిత డాక్టర్ దామోదర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఏడు నుంచి అభ్యంతరాల స్వీకరణ

అనంతపురం విద్య, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని టీచర్ల సీనియారిటీ జాబితాపై ఈ నెల ఏడో తేదీ నుంచి 12వ తేదీ వరకూ అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు డీఈఓ ప్రసాద్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గవర్నమెంట్, జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యల కింద పనిచేసే టీచర్ల సాధారణ సీనియారిటీ జాబితాను ఇప్పటికే తయారు చేశామన్నారు. మార్చి 10వ తేదీ మొదటి విడత, 22న రెండో విడత అభ్యంతరాలు స్వీకరించి సరి చేశామన్నారు. ఎస్‌జీటీ, తత్సమాన కేడర్ నుంచి స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ల కోసం సబ్జెక్టుల వారీగా టీచర్ల తాత్కాలిక సీనియారిటీ జాబితాను రూపొందించామని తెలిపారు. ఈ జాబితాను 4వతేదీ డీఈఓ బ్లాగ్‌లో, నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలుంటే... ఈ నెల 7వ తేదీ నుంచి 12వ తేదీలోగా డీఈఓ ఆఫీస్‌లో ఆధారాలతో తెలియజేయాలన్నారు.

పాలకవర్గం ప్రపోజల్స్ పంపండి

మార్కెట్ కమిటీలపై ప్రభుత్వ ఆదేశం

అనంతపురంరూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఇటీ వల పలు మార్కెట్ కమిటీలకు సంబంధించిన చైర్మన్లను ఎంపిక చేస్తూ ప్రభుత్వం జాబితా విడుదల చేసిన విషయం విదితమే. ఆమేరకు ఆయా కమిటీల పాలకవర్గ సభ్యుల ప్రపోజల్స్ పంపించాలని సంబంధిత ఉన్నతాధికారుల నుంచి జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులకు ఉత్తర్వులు అందాయి. ఈక్రమంలో ఉమ్మడి జిల్లాలోని కళ్యాణదుర్గం, గుత్తి, మడకశిర, హిందుపురం, ధర్మవరం కమిటీలకు సంబంధించి చైర్మన్, వైస్‌చైర్మన్, ఇతర సభ్యులకు సంబంధించిన ప్రపోజల్స్ పంపాలని ఉత్తర్వుల్లో పేర్కొనట్లు ఉమ్మడి జిల్లాల మార్కెటింగ్ శాఖ అధికారులు వెల్లడించారు. ఆమేరకు ఆయా కమిటీలకు సంబంధించిన పాలక వర్గ సభ్యుల ప్రపోజల్స్ సిద్ధం చేసి రెండు, మూడు రోజుల్లో ప్రభుత్వానికి పంపనున్నారు. ఆ తరువాత పాలక వర్గ సభ్యుల వివరాలు సంబంధిత అధికారులు అధికారికంగా ప్రకటించనున్నట్లు ఆయా వర్గాల ద్వారా తెలుస్తోంది.

యూనిట్లను గ్రౌండింగ్ చేయించాలి: కలెక్టరు

అనంతపురం టౌన్, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన యూనిట్లను వెంటనే గ్రౌండింగ్ చేయించాలని అధికారులను కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ జిల్లాకు 1728యూనిట్లు మంజూరు కాగా ఇప్పటివరకు మున్సిపాల్టీలు, ఎంపీడీఓలుకలిసి 1571యూనిట్లను బ్యాంకులకు పంపినట్లు తెలిపారు. మిగిలిన యూనిట్లకు వెంటనే లబ్ధిదారులను ఎంపిక చేసి బ్యాంకులకు పంపాలని సూచించారు. ఈనెల 11కి యూనిట్లు గ్రౌండింగ్ అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ, సుబ్రహ్మణ్యం, ఎల్డీఎం మానస, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.


ఎస్సీ కాలనీలో ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న ప్రజలు

ఈ దాహం తీరనిది !

గుత్తిలో తాగునీటి కష్టాలు

- గతం కంటే మెరుగైనా.. ఇంకా ఇబ్బందులే
- కేటాయింపు మేరకు సరఫరా కాని నీరు
- ఇబ్బంది పడుతున్న పట్టణ ప్రజలు

గుత్తి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారుతున్నా గుత్తి మున్సిపాలిటీలో ప్రజల తాగునీటి కష్టాలు మాత్రం తీరడం లేదు. వైసీపీ పాలనలో కంటే ప్రస్తుతం పరిస్థితి మెరుగుపడినప్పటికీ పలు వార్డుల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతూనే ఉన్నారు. సత్యసాయి, వైటీ చెరువు (వైటీసీ) ప్రాజెక్టుల నుంచి కేటాయించిన మేరకు నీరు సరఫరా కాకపోవడం, స్థానికంగా ఉన్న జలవనరులను పూర్తి స్థాయిలో వినియోగించుకోలేకపోవడంతో నీటి ఎద్దడి ఏర్పడుతోంది. మున్సిపల్ పరిధిలో 25వార్డులు ఉండగా 50వేల జనాభా ఉంది. 6532 కొళాయి కనెక్షన్లు ఉన్నాయి. ప్రతి ఒక్కరికి నిర్దేశించిన ప్రమాణాల మేరకు రోజుకు 130లీటర్ల నీటిని అందించాల్సి ఉంది. అయితే ప్రస్తుతం 40లీటర్లు మాత్రమే అందిస్తున్నా రు. 163స్పాట్ డెలివరీ ట్యాంకులు ఉన్నాయి. పట్టణ జనాభాకు రోజుకు 40లక్షల లీటర్లు అవసరమైతే 23లక్షలు మాత్రమే సరఫరా చేస్తున్నారు. వైటీసీ ప్రాజెక్టు ద్వారా రోజుకు 15లక్షల లీటర్ల నీరు సరఫరా కావాల్సి ఉండగా కేవలం 5లక్షలు మాత్రమే సరఫరా అవుతున్నాయి. సత్యసాయి ప్రాజెక్టు ద్వారా 25లక్షల లీటర్లు రావాల్సి ఉండగా 15లక్షలు మాత్రమే సరఫరా అవుతున్నాయి. ఈ ప్రాజెక్టులకు రూ.22కోట్ల మేర మున్సిపాలిటీ బకాయిపడింది.


నిలిచిపోయిన ట్యాంక్ పనులు

గతంలో నెలకోసారి సరఫరా

మున్సిపల్ పరిధిలో గుత్తి, గుత్తి ఆర్‌ఎస్, సూరసింగపల్లి, చెట్నేపల్లి ఉన్నాయి. గత వైసీపీ పాలనలో నెలకొకసారి నీటిని సరఫరా చేసేవారు. ప్రస్తుత ప్రభుత్వం గుత్తి చెరువుకు హంద్రీనీవా జలాలు తెప్పించి 15రోజులకొకసారి సరఫరా చేస్తోంది. మరి కొన్ని వార్డులలో మూడు రోజులకొకసారి నీరు సరఫరా అవుతోంది. మూలనపడ్డ నీటి పథకాలను పునరుద్ధరించారు. వేసవిలో భూగర్భజలాలు తగ్గిపోయేప్రమాదం ఉండటంతో నీటి సమస్య ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టారు. గత ప్రభుత్వంలో ట్యాంకర్ల యజమానులకు దాదాపు రూ.1కోటి మేర బకాయి పడ్డారు. ప్రస్తుతం నాలుగు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని, ట్యాంకర్లకు టెండర్లను పిలచి నీటి సరఫ రా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. 35ఏళ్ల క్రితం వేసిన పైపులైను కావడంతో తరచూ తాగునీటి పథకాల పైపులైన్లు పగలిపోయి, నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది.

15 కాలనీలలో నీటి కష్టాలు

పట్టణంలోని దాదాపు 15 కాలనీల్లో ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. కొళాయిల ద్వారా నీటి సరఫరా కాకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. బీసీ కాలనీ, జడ్‌వీరారెడ్డి, దాసరి కాలనీ, పైమాల వీధి, కోటవీధి, బండలపాలిష్ ఏరియా, చెట్నేపల్లి, గుత్తిఆర్‌ఎస్ ఎస్సీ కాలనీ తదితర కాలనీలో ప్రజలు నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఈ కాలనీలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు.

సమస్య పరిష్కారానికి చర్యలు

మున్సిపల్ పరిధిలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా సత్వరమే చర్యలు చేపట్టాం. రూ.90లక్షలు నిధులు మంజూరయ్యాయి. టెండర్లు పూర్తిఅయ్యాయి. ఈ నిధులతో నూతన బోర్లు, పంపు మోటర్లు, పైపులైన్ల మరమ్మతులు చేయిస్తాం. ఎక్కడ నీటి సమస్య ఉంటే అక్కడ బోరు ఏర్పాటు చేసి ప్రజలకు నీటిని అందిస్తాం. సమ్మర్ యాక్షన్‌ప్లాన్ కింద రూ.1.96కోట్లతో నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం. పామిడి పెన్నానదిలోని ఏడుబోర్లకు సంబంధించి గత వర్షాలకు పైపులైన్ దెబ్బతినడంతో వాటి మరమ్మతుల కోసం ఎంపీ నిధులు రూ.20లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో పైప్‌లైన్ పునరుద్ధరించి తాగునీటి సరఫరాకు చర్యలు చేపడతాం. రూ.173కోట్ల మిడ్‌పెన్నార్ ప్రాజెక్ట్ పూర్తయితే గుత్తికి తాగునీటి సమస్య తీరుతుంది.

- జబ్బర్‌మీయా, మున్సిపల్ కమిషనర్

ఎస్‌ఐ ప్రకృతి సేద్యం..!

రకరకాల పండ్లమొక్కల సాగు... విరగ్గాసిన చెట్లు


మామిడి పంటను చూపుతున్న ఎస్‌ఐ

బెళుగుప్ప, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రసాయన మందులు, ఎరువులతో పండించిన పంటలు ఆరోగ్యానికి హానికరమనీ, భూమిని నిస్సారం చేస్తాయని తెలిసినా చాలా మంది రైతులు వాటినే వాడుతున్నారు. ఓ పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్‌ఐ) మాత్రం ప్రకృతి వ్యవసాయ విధానంపై ఆసక్తి పెంచుకున్నారు. ఇది లాభదాయకమని చాటి చెప్పాలనుకున్నారు. అదే పట్టుదలతో పంటలు పెట్టారు. 1.20 ఎకరాలో రకరకాల పండ్లమొక్కలు నాటారు. దేశవిదేశాల నుంచి సైతం మొక్కలు తెప్పించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేశారు. చెట్లు కాపునకు వస్తున్నాయి. కొన్ని విరగ్గాశాయి కూడా.

రకరకాల మొక్కలు..

నంద్యాల జిల్లా ఆవుకు మం డలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన ఈయన తెలంగాణలో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్నారు. బెళుగుప్ప మండలం గుండ్లపల్లిలో వి వాహం చేసుకుని, ఇక్కడే నాలుగేళ్ల క్రితం 1.20 ఎకరా భూమి కొనుగోలు చేశారు. అందులో పండ్లతోట సాగు చేస్తున్నారు. తక్కువ విస్తీర్ణంలోనే 250 మామిడి మొక్కలు, పనస పది, సీతాఫలం 20, అంజీర పది, జామ 30, నేరేడు ఐదు, సపోట, దాల్చిన చెక్క, ఎల్లో డ్రాగన్ ఫ్రూట్, ఆయుర్వేద మొక్కలు, క్యాన్సర్ నివారణకు వినియోగించేవి, బనానా మ్యాంగో కూడా సాగుచేస్తున్నారు. కిలో వెయ్యి రూపాయలు ధర పలికే టాం అట్కిన్ రకం మామిడి మొక్కలు సైతం నాటారు. భారతదేశంలోనే లేని మియాజకి, థాయిల్యాండ్ రకాల మొక్కలు సైతం సాగు చేస్తున్నారు. పలు మొక్కలను కేరళ, బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీ నుంచే కాకుండా ఇతర దేశాల నుంచి కూడా తెప్పించి, నాటారు. వాటిని పూర్తిగా ప్రకృతి వ్యవసాయ విధానంలోనే సాగు చేస్తున్నారు. విధి నిర్వహణలో ఉన్నపుడు కూలీలకు ఫోన్‌లో దిశానిర్దేశం చేస్తుంటారట. సెలవు రోజుల్లో ఇక్కడకు వచ్చి తోటలో పనులు చేస్తుంటానని ఆయన చెబుతున్నారు. పంటలు కోసి, ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.


ఎల్లో డ్రాగన్ ఫ్రూట్ మొక్క

ప్రకృతి వ్యవసాయం లాభసాటి అని నిరూపిస్తా



ఈ ప్రాంత నేలలు ప్రకృతి వ్యవసాయానికి అనుకూలమని గత నాలుగేళ్లలో గమనించా. ప్రకృతి వ్యవసాయ విధానంలో దిగుబడులు ఎలా ఉంటాయోనని తెలుసుకోవడానికే సాగుచేస్తున్నా. పంటకు తెగుళ్లు సోకితే వేపనూనె పిచికారీతోనే నివారించవచ్చు. ప్రకృతి సాగులో తెగుళ్ల బెడద ఉండదు. మరిన్ని పండ్లమొక్కలు సాగుచేసి, ప్రకృతి వ్యవసాయం లాభసాటి అని నిరూపిస్తా.

- రామాంజనేయులు, ఎస్‌ఐ

ఎట్టకేలకు ఎన్నికల ప్రక్రియ

అనంతపూర్ క్లబ్ ఎలెక్షన్స్‌కు గ్రీన్ సిగ్నల్

ఎన్నికల అధికారిగా జిల్లా రిజిస్ట్రార్


నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన మద్యం దుకాణం గది

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వివాదాలకు కేరాఫ్‌గా మారిన అనంతపూర్ క్లబ్ ఎన్నికలకు ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ పడింది. రెండేళ్లుగా వాయిదా పడుతూ వచ్చిన ఎన్నికలకు కలెక్టర్ ఆమోదం తెలిపారు. క్లబ్‌లో పరిణామాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలంటే కచ్చితంగా ఎన్నికలు నిర్వహించాలన్న మెజార్టీ సభ్యుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకున్న కలెక్టర్ ఈ మేరకు నిర్ణయం ప్రకటించారు. పైగా క్లబ్ ఆవరణలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణానికి అద్దెకు ఇచ్చి, లోపల ఉండే ఓ గదిని వైన్‌షాప్‌కు అటాచ్డ్ రూంగా కేటాయించడం పట్ల క్లబ్ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అటాచ్డ్ రూంగా కేటాయించిన గదిలో ఉన్న వ్యక్తికి మరో గదిని కేటాయించడానికి ముడుపులు తీసుకున్నట్లు సభ్యులు ఆరోపిస్తున్నారు. క్లబ్‌లో బార్ అండ్ రెస్టారెంట్ బోర్డు ఉంచడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణతోనే క్లబ్‌లో వివాదాలకు ముగింపు పలకవచ్చని సభ్యులు అభిప్రాయ పడుతున్నారు. తాజాగా క్లబ్ ఆవరణలో ఉన్న అరబిక్ మెహిల్ రెస్టారెంట్‌లో జరిగిన అగ్నిప్రమాదం పట్ల సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంటలు క్లబ్ లోపలివైపు ఉన్న ఇండోర్ స్టేడియంలో చెక్కకు వ్యాపించి ఉండుంటే నష్టం ఊహించని స్థాయిలో ఉండేదని భయభ్రాంతులకు లోనవుతున్నారు. క్లబ్ ఎన్నికల అధికారిగా జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్ భరత్‌ను కలెక్టర్ నియమించారు.

క్లబ్‌లో మద్యం దుకాణం నిర్వహణ

అనంతపూర్ క్లబ్‌లో నిబంధనలకు విరుద్ధంగా క్లబ్ ఆవరణలో మద్యం దుకాణం నిర్వహిస్తున్నారు. పైగా క్లబ్ లోపల ఉండే ఓ గదిని అక్కడ అద్దెకున్న వ్యక్తికి గుడ్‌విల్ ఇచ్చి ఖాళీ చేయించి, అతడికి మరో గదిని కేటాయించారు. వీధి వ్యాపారులు అద్దె చెల్లించి తమ సామగ్రి ఉంచుకున్న గదిని ఖాళీ చేయించి, అక్కడ ఆ వ్యక్తికి కేటాయించడం గమనార్హం. మద్యం దుకాణానికి అటాచ్డ్ రూంను క్లబ్ ఆవరణలో కేటాయించడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత పాలకవర్గం పదవీకాలం ఆగస్టులోనే ముగిసింది. ఇప్పటి వరకు అదే పాలకవర్గం కొనసాగుతోంది. గతంలో ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితా తయారీతోపాటు క్లబ్‌లో జరుగుతున్న పరిణామాలపై ఓ వైపు ఆర్డీఓ, మరోవైపు డీసీఓలను విచారణాధికారులుగా కలెక్టర్ నియమించారు. విచారణ చేసినప్పటికీ ఆ వివరాలు బహిర్గతం చేయకపోవడం గమనార్హం.

పారదర్శకంగా ఎన్నికలు..

అనంతపూర్ క్లబ్ ఎన్నికలకు చర్యలు చేపడుతున్నాం. క్లబ్‌లో పరిణామాలతో పాటు ఓటర్ల వివరాలు ఇవ్వాలని సెక్రటరీకి సూచించాం. గతంలో ఓటర్ల వివరాల్లో జరిగిన గందరగోళంతోనే ఎన్నికలు వాయిదా వేసినట్లు చెబుతున్నారు. ఈ దఫా కచ్చితంగా ఓటర్ల వివరాలను సేకరించడంతో పాటు పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తాం. ఇందులో ఎవరి జోక్యం ఉండరాదని ఇప్పటికే సభ్యులకు సమాచారం ఇచ్చాం. నిబంధనల ప్రకారమే క్లబ్ పాలకవర్గానికి ఎన్నికలు జరుగుతాయి.

- భార్గవ్ భరత్, అనంతపూర్ క్లబ్ ఎన్నికల అధికారి, జిల్లా రిజిస్ట్రార్



క్లబ్ లోపల ఉన్న బార్ అండ్ రెస్టారెంట్ బోర్డు

రాలిన మామిడి కాయలు

శింగనమల: చిన్నజలాలపురం రైతు ఎన్‌వి నారాయణ తోటలో గాలివానకు మామిడి కాయలు రాలిపోయాయి. మండల వ్యాప్తంగా పది ఎకరాల్లో మామిడి పంట దెబ్బతిందని అధికారులు తెలిపారు. శింగనమల చెరువు ఆయకట్టు కింద 50 ఎకరాల్లో వరి పంట


దెబ్బతిన్న వరి మడిని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఏఓ


చిన్నజలాలపురంలో వర్షానికి రాలిన మామిడి కాయలు

నేలకొరిగింది. సోదనపల్లి-పోతురాజుకాల్వ మధ్య వంకకు భారీగా నీరు చేరడంతో నిర్మాణంలో బ్రిడ్జి దెబ్బతింది. రూ.4 లక్షల విలువ గల సెంట్రింగ్ సామగ్రి కొట్టుకుపోయిందని కాంట్రాక్టరు తెలిపారు. ఆ ప్రాంతంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొరివిపల్లి, జాల్వా కాలువ, కల్లుమడి గ్రామాల్లో 120 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. తహసీల్దారు సాకే బ్రహ్మయ్య, రీసర్వే డిప్యూటీ తహసీల్దారు పునీత్ కూమార్, మండల వ్యవసాయధికారి అన్వేష్ కూమార్ పంట నష్టాన్ని పరిశీలించారు.

నల్లమాడ మండలంలో దెబ్బతిన్న మొక్కజొన్న



పంటలకు వాన దెబ్బ..!

● అరటి, వరి నేలమట్టం ● తడిసిన వేరుశగన కట్టె ● రాలిపోయిన మామిడి కాయలు ● రూ.2.15 కోట్లకుపైగా పంటనష్టం

అనంతపురం జిల్లాలో గురువారం కురిసిన గాలివానకు రూ.2.15 కోట్లకుపైగా విలువైన పంటలు దెబ్బతిన్నాయి. తాడిపత్రి, యల్లనూరు, గార్లదిన్నె, కంబదూరు, శింగనమల, బుక్కరాయసముద్రం, ఆత్మకూరు, అనంతపురం రూరల్, పెద్దవడుగూరు, కూడేరు, పెద్దపప్పూరు మండలాల్లో 55 మంది రైతులకు చెందిన 60.77 హెక్టార్లల్లో రూ.1.24 కోట్ల ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో అరటి, కాకర, కర్బూజ, దోస, చీనీ, కళింగర పంటలు ఉన్నాయి. వ్యవసాయ శాఖ పరిధిలో శెట్టూరు, నార్పల, గార్లదిన్నె, అనంతపురం రూరల్ మండలాల్లో 71 మంది రైతులకు సంబంధించి 114 హెక్టార్లల్లో రూ.91.84 లక్షల విలువైన మొక్కజొన్న, వరి పంట నష్టం జరిగింది. శ్రీసత్యసాయి జిల్లాలో గురువారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. నల్లమాడ మండలంలో అత్యధికంగా 59.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇదే మండలంలోని తిప్పయ్యగారిపల్లిలో రైతు వెంకటరెడ్డి మొక్కజొన్న పంట దెబ్బతింది. దీంతో రూ.4 లక్షలు నష్టం సంభవించింది.

- అనంతపురం అర్బన్/నెట్‌వర్క్ (ఆంధ్రజ్యోతి)

వరి, అరటి పంట ధ్వంసం

గార్లదిన్నె: ఇల్లూరు, మర్తాడు, బూదేడు, కొప్పలకొండ, కేశవాపురం గ్రామాల్లో వరి, అరటి పంటలు నేటమట్టమయ్యాయి. మొత్తం 14 మంది రైతులకు చెందిన వరి పంట 12 హెక్టార్లలో దెబ్బతింది. బూదేడులో 8 మంది రైతులు 6 హెక్టార్లలో సాగు చేసిన అరటి పంట దెబ్బతింది. దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాఖ అధికారి సోమశేఖర్‌తో కలసి తహసీల్దార్ బండారు ఈరమ్మ శుక్రవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం నష్టపరిహారాన్ని అందజేస్తుందని భరోసా ఇచ్చారు.


ఇల్లూరులో దెబ్బతిన్న వరి పంట


బూదేడులో వర్షానికి దెబ్బతిన్న అరటి పంట

కూలిన విద్యుత్ స్తంభాలు

అనంతపురం రూరల్: గాలివానకు అనంతపురం నగరంలోని డి-5 సెక్షన్ పరిధిలో ఏడు విద్యుత్తు స్తంభాలు, రెండు ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. యల్లనూరు మండలంలో 13 విద్యుత్తు స్తంభాలు కూలిపోయాయి. విద్యుత్ శాఖకు రూ.2.50 లక్షల వరకు నష్టం జరిగిందని అధికారులు తెలిపారు. లైన్లు దెబ్బతిన్న ప్రాంతాల్లో మరమ్మతులు చేశామని ఎస్‌ఈ శేషాద్రి శేఖర్ తెలిపారు.

చేతికొచ్చిన పంట..

కళ్యాణదుర్గం: కంబదూరు మండలం గుద్దెళ్ల గ్రామ రైతులు నీలావతి, హరి (తల్లీకొడుకులు) సాగు చేసిన బీరకాయ, కాకరకాయ పంటలు నేలమట్టమయ్యాయి. వారికి రూ.10 లక్షల దాకా నష్టం జరిగింది. మరో రెండు రోజుల్లో పంట కోయాల్సి ఉండగా గాలివాన దెబ్బతీసింది. హార్టికల్చర్ అధికారి గౌసియాబీ, అగ్రికల్చర్ అసిస్టెంట్ సునీల్, వీఆర్వో ఫక్కీరప్ప పంట నష్టాన్ని శుక్రవారం పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు.


వర్షానికి నేలమట్టమైన కాకర పంట

దెబ్బతిన్న దోస

కనగానపల్లి: ముక్తాపురంలో రైతులు రామక్రిష్ణ, లక్ష్మీనారాయణరెడ్డికి చెందిన ఆరు ఎకరాల్లో దోస పంట దెబ్బతింది. మామిళ్ళపల్లి, కుర్లపల్లిలో వెంకటరాముడు, అంకే నాగరాజు, శ్రీకాంత్‌రెడ్డికి చెందిన 15 ఎకరాల్లో తొలగించిన వేరుశనగ పంట తడిచిపోయింది. కనగానపల్లి, బద్దలాపురం, యలక్కుంట్ల గ్రామాల్లో ఈదురు గాలులకు అరటి నేలకొరిగి భారీగా నష్టం జరిగింది.


ముక్తాపురంలో దెబ్బతిన్న దోస పంట

క్రైం కార్నర్

విద్యార్థిపై అడవిపంది దాడి

కంబదూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక మారెమ్మగుడి కాలనీకి చెందిన విద్యార్థి బొమ్మలాట చరణ్ శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్తుండగా అడవిపంది దాడి చేసింది. విద్యార్థి తల్లిదండ్రులు బొమ్మలాట అంజి, పుష్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చరణ్ స్థానిక ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. ఒంటిపూట బడి కావడంతో శుక్రవారం ఉదయమే పాఠశాలకు బయల్దేరాడు. పాఠశాలకు వెళ్తుండగా దారి మధ్యలోని అరటి తోట నుంచి అడవిపంది పరుగున వచ్చి, విద్యార్థిపై దాడి చేసింది. చరణ్ అక్కడే పడిపోయాడు. అదే దారిలో వెళ్తున్న పాదచారులు గమనించి, గట్టిగా కేకలు వేసేసరికి అడవిపంది మళ్లీ అరటితోటలోకి వెళ్లిపోయింది. పాదచారులు.. విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. చరణ్‌కు వీపు భాగం, నడుము కిందిభాగంలో తీవ్ర గాయాలయ్యాయి. పైకి లేవలేని స్థితిలో ఉన్నాడు. వెంటనే కంబదూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కళ్యాణదుర్గం, అటు నుంచి అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అటవీశాఖాధికారులు.. విద్యార్థిని పరామర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు.


చికిత్స పొందుతున్న విద్యార్థి చరణ్

ఆత్మహత్యకు యత్నించిన రైతు మృతి

బెళుగుప్ప, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఆత్మహత్యకు యత్నించిన బెళుగుప్ప రైతు హనుమంతరెడ్డి కోలుకోలేక గురువారం రాత్రి మృతి చెందారు. ఆయన భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ శివ తెలిపారు. హనుమంతరెడ్డికి ఆరు ఎకరాల పొలం ఉంది. వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. పప్పు శనగ సాగు చేసి అప్పులపాలయ్యాడు. పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు వడ్డీతో రూ.10 లక్షలు దాటాయి. ఈ క్రమంలో మనోవేదనతో మద్యానికి బానిసయ్యాడు. దిక్కుతోచని స్థితిలో గత నెల 30న క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. ఆయనకు ఇద్దరు కూతుళ్లు అనూష, పూజిత, కుమారుడు రాకేష్ ఉన్నారు.


హనుమంతరెడ్డి(ఫైల్)

విద్యుదాఘాతంతో కూలీ మృతి

అనంతపురం క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ మండల పరిధిలో నివాసముంటున్న ఓ కూలీ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. అనంతపురం రూరల్ మండలం కందుకూరుకు చెందిన లింగమయ్య(28) కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతను అవివాహితుడు. శుక్రవారం సాయంత్రం ఎఫ్‌సీఐ గోడౌన్ సమీపంలో విద్యుత్‌పోల్ పైకెక్కి కరెంట్ కనెక్షన్ ఇస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై కిందకు పడ్డాడు. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై ఇటుకలపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్పోర్ట్స్ సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఎన్‌ఎస్‌ఎన్‌ఐఎస్‌లో ఆరువారాల స్పోర్ట్స్ సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, సైక్లింగ్, క్రికెట్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్, హ్యాండ్‌బాల్, జూడో, కబడ్డీ, ఖోఖో, రోల్‌బాల్, రోయింగ్, షూటింగ్, స్విమ్మింగ్, తైక్వాండో, టేబుల్‌టెన్నిస్, లాన్‌టెన్నిస్, వెయిట్‌లిఫ్టింగ్, రీజనింగ్, ఉషు, యోగా క్రీడాంశాలలో ఆరు వారాల కోర్సులు ఉంటాయన్నారు. ఆయా కోర్సులలో అడ్మిషన్‌లకు ఈనెల 14 లోపు ఆన్‌లైన్‌లో దరఖా స్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు అశోక్‌నగర్‌లోని ఇండోర్‌స్టేడియంలో నేరుగా లేదా ఫోన్ నంబరు 08554-315632ను సంప్రదించాలని కోరారు.

వైద్య శాఖలో ఉద్యోగాలకు..

అనంతపురం టౌన్, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులను ఎన్‌హెచ్‌ఎం(నేషనల్ హెల్త్ మిషన్) కింద కాంట్రాక్ట్ పద్ధతిపై భర్తీ చేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టరు ఈబీదేవి తెలిపారు. ఇందులో క్లినికల్ ఫిజియోథెరపిస్టు01, ఆడియాలజిస్టు, స్పీచ్‌థెరపిస్ట్01, ఆప్తమాట్రిస్టు01, ఫార్మాసిస్టు01, డేటా ఎంట్రీ ఆపరేటర్ 04, క్లాస్ ఫోర్ సర్వీసెస్ పోస్టులు 08 ఉన్నాయన్నారు. ఈపోస్టులకు ఈనెల 10వ తేదీలోగా దరకాస్తు చేసుకోవాలన్నారు. వెబ్‌సైట్‌లో దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకొని పూరించి జిల్లా కార్యాలయంలో అందజేయాలని ఓప్రకటనలో సూచించారు.

కట్నం కేసులో ముద్దాయికి ఏడాది జైలు

గార్లదిన్నె, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఆదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధించిన కేసులో ముద్దాయికి ఏడాది జైలు శిక్ష, రూ. 10వేలు జరిమాన విధించారు. ఈ మేరకు శుక్రవారం మొబైల్ కోర్టు న్యాయాధికారి సుజన్ తీర్పు వెలువరించారు. గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన ప్రసాద్‌కు ఆదే గ్రామానికి చెందిన సుహాసినితో 2017లో వివాహం జరిగింది. వారికి ఒక కుమారుడు సంతానం. 2019లో భర్త ప్రసాద్‌తో పా టు అత్త, మరిది కలసి ఆదనపు కట్నం తీసుకురాలేదన తనను మానసికంగా హింసించారని బాధితురాలు సుహాసిని ఫిర్యాదు చేసింది. దీనిపై గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌లో కేసు నమో దయింది. శుక్రవారం మొబైల్ కోర్టు న్యాయాధికారి సుజన్ ముద్దాయి ప్రసాద్‌కు ఏడాది జైలు శిక్ష, రూ. 10వేలు విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

చీనీ కాయలు టన్ను రూ.26 వేలు

అనంతపురంరూరల్, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.26వేలు, కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి రూ.15,500తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1406 టన్నుల చీనీకాయలు వచ్చాయని పేర్కొన్నారు.

జారి పడి వైద్యుడి మృతి

అనంతపురం క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో నివాసముంటున్న డెంటల్ డాక్టర్ అమిలినేని మధు(49) ప్రమాదవశాత్తు నాలుగో అంతస్తు నుంచి జారి పడి మృతి చెందారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన మేరకు... డాక్టర్ అమిలినేని మధు, డాక్టర్ సుష్మ భార్యాభార్తలు. వీరు నగరంలోని రెవెన్యూ కాలనీలో నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. భార్యాభర్తలు క్లాక్‌టవర్ సమీపంలో రూప డెంటల్ ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం మధు ఇంటికెళ్లి భోజనం చేసి వస్తుంటారు. అదే క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం 12.30గంటల సమయంలో ఇంటికెళ్లారు. కొంతసేపటికి నాలుగో అంతస్తు నుంచి జారి ఆ ఇంటి ఆవరణలో కింద పడ్డారు. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెం దారు. ఆ ఘటన చూసిన ఓ వ్యక్తి మధు బాబాయికి సమాచారం అం దించాడు. త్రీటౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. భార్య సుష్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ శాంతిలాల్ తెలిపారు.


మధు(ఫైల్)

పారా పోటీల్లో జిల్లాకు రజతం

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పారా పోటీల్లో జిల్లాకు రజత పతకం దక్కింది. కంబోడియా దేశంలో ఇటీవల నిర్వహించిన ఒకటో ఆసియా పారా త్రోబాల్ పోటీలకు భారతజట్టు తరఫున పాల్గొన్న జిల్లా వాసి రోషిరెడ్డి అత్యద్భుత ప్రతిభ ప్రదర్శనతో రజత పతకం సాధించాడు. మలేషియాతో తలపడిన రోషిరెడ్డి మొదటి మూడు రౌండ్లలో మెరుగైన ప్రతిభతో పతకం సాధించాడు. అంతర్జాతీయ స్థాయిలో జిల్లాకు రజతపతకం సాధించిన రోషిరెడ్డికి జిల్లా పారా త్రోబాల్ అసోసియేషన్ కార్యదర్శి అల్బర్ట్ ప్రేమ్‌కుమార్ అభినందనలు తెలిపారు.


రోషిరెడ్డి

నేటి నుంచి శ్రీరామిరెడ్డి కార్మికుల సమ్మె

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి) : శ్రీరామిరెడ్డి వాటర్ సప్లయ్ స్కీమ్ వర్కర్ల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ శనివారం అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు శ్రీరామిరెడ్డి వాటర్ సప్లయ్ స్కీమ్ వర్కర్ల యూనియన్ గౌరవాధ్యక్షుడు ఓబులు, అధ్యక్షుడు ఎర్రిస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్కీమ్ వర్కర్లకు బకాయి వేతనాలు, పీఎఫ్ చెల్లిస్తామని గతంలోనే హామీ ఇచ్చిందన్నారు. 2025 ఫిబ్రవరి 20న కళ్యాణదుర్గంలో జరిగిన ఒప్పందాలు అమలు చేయకపోవడం వల్లే సమ్మె చేసే పరిస్థితి వచ్చిందన్నారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదన్నారు. బకాయిలన్నీ కార్మికులు ఖాతాల్లో జమ చేసినపుడే సమ్మె విరమిస్తామని పేర్కొన్నారు.

ఐదుగురికి జైలు శిక్ష

కొత్తచెరువు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారేపల్లిలో పీర్ల పండుగ సందర్భంగా రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించి పెనుకొండ కోర్టు ఐదుగురికి జైలు శిక్ష విధించినట్లు అప్‌గ్రేడ్ ఇన్‌చార్జ్ సీఐ సురేశ్ తెలిపారు. 2015 అక్టోబరు 15న పీర్ల పండుగ రోజు గుండం వద్ద రెండు వర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. అప్పట్లో కొత్తచెరువు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. విచారణ ముగిసిన నేపథ్యంలో శుక్రవారం వాదోపవాదాలు విన్న న్యాయాధికారి మొదటి కేసులోని ముద్దాయిలు చిన్నక్కగారి నరసింహులు, చిక్కన్నగారిరవి, చిక్కన్నగారి నారాయణప్ప, చిక్కన్నగారి నాగభూషణలకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు రెండో కేసులోని ముద్దాయి ఆదిఆంధ్ర నాగేంద్రకు రెండేళ్ల జైలు, రూ.10వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. ఇందులో ఏ1, ఏ3 కేసులకు సంబంధించిన వారి కేసులు కొట్టివేశారని బాధితులకు రూ.8వేలు చెల్లించాలని ప్రభుత్వాన్ని న్యాయాధికారి ఆదేశించినట్లు సీఐ తెలిపారు.

గుంతకల్లు మీదుగా వేసవి రైలు

గుంతకల్లు, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రయాణీకుల రద్దీని నియంత్రించడానికి బెంగళూరు-కలబురగి మధ్య ప్రత్యేక వీక్లీ రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-కలబురగి ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ (నం.06519) ఏప్రిల్ 5, 12, 19, 26 తేదీల్లో (శనివారాల్లో) బెంగళూరులో రాత్రి 9.15 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.40 గంటలకు కలబురగికి చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 06520) ఏప్రిల్ 6, 13, 20, 27 తేదీల్లో (ఆదివారాలలో) ఉదయం 9.35 గంటలకు కలబురగిలో బయలుదేరి అదేరోజు రాత్రి 8 గంటలకు బెంగళూరు చేరుకుంటుందని తెలియజేశారు. ఈ రైలు యల్హంక, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాద్గిర్, షాద్‌నగర్ స్టేషన్ల మీదుగా గమ్యస్థానానికి చేరుతుందని వివరించారు.



రైళ్ల పాక్షిక రద్దు: నైరుతి రైల్వేజోన్ పరిధిలోని క్యాస్టిల్‌రాక్-కులెం రైల్వే సెక్షన్‌లో ట్రాక్ మెయింటెనెన్స్ పనులు చేస్తున్న కారణంగా గుంతకల్లు మీదుగా వెళ్లే పలు రైళ్లను పాక్షికంగా రద్దుపరచినట్టు రైల్వే అధికారులు పేర్కొన్నారు. షాలిమార్-వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్ (నం. 18047) రైలును ఈనెల 17, 19, 21, 22, 24, 26, 28 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 18048)ను ఈనెల 20, 22, 24, 25, 27, 29, మే 1 తేదీల్లోనూ హుబ్లీ-వాస్కోడిగామా సెక్షన్‌లో రైలును పాక్షికంగా రద్దుచేసి, కేవలం హుబ్లీ-షాలిమార్ సెక్షన్‌లో నడపనున్నట్టు తెలియజేశారు. అలాగే తిరుపతి/హైదరాబాద్-వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్ (నం.17419/17021) రైళ్లను ఈనెల 17, 24 తేదీల్లోనూ, వీటి తిరుగు ప్రయాణపు రైళ్లను ఈనెల 18, 25 తేదీల్లోనూ వాస్కో-హుబ్లీ సెక్షన్‌లో రద్దుచేసి కేవలం హుబ్లీ-హైదరాబాద్/తిరుపతి సెక్షన్లలో నడపనున్నట్టు వివరించారు. సికింద్రాబాద్-వాస్కోడిగామా (నం.17039) రైలును ఈనెల 18, 23, 25 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 17040)ను ఈనెల 19, 24, 26 తేదీల్లోనూ హుబ్లీ-సికింద్రాబాద్ సెక్షన్‌లో మాత్రమే నడపనున్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

డీ.హీరేహాళ్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగమనహళ్లి గ్రామ సమీప నేషనల్ హైవే వద్ద గుర్తు తెలియని వృద్ధుడి(75) శవాన్ని గుర్తించినట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు మతి స్థిమితం లేక గత కొన్ని రోజులుగా మండల చుట్టు పక్కల ప్రాంతాల్లో ఈ వృద్ధుడు సంచరించేవాడన్నారు. శుక్రవారం మధ్యాహ్నం లింగమనహళ్లి గ్రామ సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద భోజనం చేస్తూ పడిపోయాడన్నారు. ఎండ వేడికి తాళేక మృతి చెంది ఉంటాడన్నారు. స్థానికుల సమాచారం మేరకు అక్కడికి చేరుకుని స్థానిక వీఆర్వో సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించినట్లు తెలిపారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

తాడిపత్రి, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబాభవానీ వీధికి చెందిన ఇంటర్ విద్యార్థి హర్షత్‌సాయి (17) శుక్రవారం ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. రంగయ్య, అమరావతి దంపతుల రెండో కుమారుడు హర్షత్‌సాయి విజయవాడలో శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవలే పరీక్షలు రాశాడు. కాగా రెండవ సంవత్సరం తరగతులకు రావాలని పిలవడంతో కొద్దిరోజులు ఆగి వెళతానని తల్లితో చెప్పాడు. దీంతో ఆమె మందలించి పంపించింది. రెండురోజుల క్రితం విజయవాడకు వెళ్లాడు. అక్కడ కాలేజీకి వెళ్లకుండా శుక్రవారం తెల్లవారు జామున ఇంటికి వచ్చాడు. కుమారుడు వెనక్కు వచ్చాడని తల్లి ఏమి అనలేదు. ఉదయాన్నే టిఫిన్ పెట్టి ఆమె పనుల్లో నిమగ్నమయ్యారు. ఈక్రమంలో హర్షత్‌సాయి బెడ్‌రూములోకి వెళ్లి పడుకున్నాడు. మధ్యాహ్నం 2గంటల సమయంలో భోజనానికి రావాలని తల్లి పిలువగా పలకలేదు. దీంతో ఆమె కిటికీలో నుంచి చూడగా ఉరికి వేలాడుతూ కుమారుడు కనిపించాడు. దీంతో బోరుమని విలపించింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి రంగయ్య దక్షిణాఫ్రికాలో పరిశ్రమల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పెద్ద కుమారుడు ఆదిత్య కన్యాకుమారిలో బీటెక్ చదువుతున్నాడని వారు తెలిపారు. ప్రస్తుతం ఇంటి వద్ద తల్లి అమరావతి మాత్రమే ఉంటోంది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


హర్షత్‌సాయి మృతదేహం

న్యూస్ బాక్స్

మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్‌గా అంబటి అరుణశ్రీ

చైర్మన్‌తో పాటు డైరెక్టర్ల జాబితా విడుదల



అంబటి అరుణశ్రీ

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ధర్మవరం మార్కెట్‌యార్డు చైర్మన్‌తో పాటు వైస్‌చైర్మన్, 13మంది మెంబర్లతో కూడిన జాబితాను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిందని జిల్లా మార్కెటింగ్ అధికారి మూర్తి తెలిపారు. ఇందులో చైర్‌పర్సన్‌గా ధర్మవరానికి చెందిన అంబటి అరుణశ్రీ (ఓసీ), వైస్ చైర్మన్‌గా మూల్లగూరి అయ్యప్ప (ఓసీ), మెంబర్లుగా అచ్చెమ్మ (ఎస్టీ), చారుగుండ్ల రాములమ్మ (బీసీ), గిర్రాజు పద్మనాభం (బీసీ), కె.పోతలయ్య (బీసీ), కె.రవీంద్ర (ఓసీ), సాంబశివనాయక్ (ఎస్టీ), కమతం వాణి (బీసీ), ఎం.నాగమణి (ఎస్సీ), ఆజాద్‌బాబు (మైనార్టీ), రాఘవరెడ్డి (ఓసీ), సాకే ఓబిలేసు (ఎస్సీ), తమ్మినేని నాగలక్ష్మి (ఓసీ), వెంపల్లి నాగూర్‌బీ (మైనార్టీ)తో కూడిన జాబితా విడుదల చేసినట్లు తెలిపారు. జాబితాను ధర్మవరం మార్కెట్‌యార్డు కార్యాలయానికి చేరవేసినట్లు తెలిపారు. వీరికి సంబంధించి వివరాలను వేగవంతంగా సేకరించి ప్రభుత్వానికి పంపించాలని ఉత్తర్వులు వచ్చినట్లు ఆయన తెలిపారు. అనంతరం ప్రభుత్వం నుంచి జీవో రాగానే నూతన కమిటీ ప్రమాణస్వీకారం జరుగుతుందని తెలిపారు. కాగా వారం రోజుల క్రితం ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో ఇటీవల బీజేపీలోకి చేరిన జగ్గా నాగరత్నమ్మ పేరు రాగా.. బీజేపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో ధర్మవరం పట్టణానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు అంబటి సతీష్ భార్య అంబటి అరుణశ్రీని ఎంపికచేసినట్లు సమాచారం.

సీతారాముల కల్యాణానికి తరలిరండి

ముదిగుబ్బ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక పాత ఊరులో సూర్య చంద్ర అభయ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని ఆదివారం నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని కోరారు.

వీఆర్‌ఏ మృతి

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని వనుకువారిపల్లికి చెందిన వీఆర్‌ఏ గంగులమ్మ (58) శుక్రవారం మరణించారు. ఉన్నఫలంగా ఆమె మంచంపైనుంచి కిందికి పడటాన్ని గమనించిన బంధువులు వైద్యశాలకు తరలించేలోపే మరణించారు. తహసీల్దార్ అనంతచారి, ఆర్ఐ శ్రీనివాసరెడ్డి, వీఆర్‌ఓ రమణప్ప, ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. దహన సంస్కారాలకు తహసీల్దార్ రూ. పదివేలు అందించారు.

నీటి సమస్య పరిష్కారం

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఏటా రంజాన్, బక్రీద్ పండుగల సమయంలో ముస్లింలు ఈద్గా వద్ద నీటి కోసం ఇబ్బందులు పడేవారు. దీన్ని గుర్తించిన విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత ఫకృద్దీన్ శుక్రవారం అక్కడ బోరు వేయించారు. నీరు పుష్కలంగా ఉండడతో నీటి సమస్య పరిష్కారమైంది. దాతకు మత పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

మామిడి ఎగుమతులపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న సభ్యులు

బుక్కపట్నం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మామిడి కాయల ఎగుమతులపై మండలంలోని బుచ్చయ్యగారిపల్లి, కొత్తకోట తదితర గ్రామాల్లో రైతులకు ఉద్యాన శాఖాధికారి నవీన్‌కుమార్ శుక్రవారం అవగాహన కల్పించారు. మామిడి పంటను అధిక సంఖ్యలో దేశం నుంచి ఎగుమతులు చేసే ప్రముఖ అగ్రిపార్కు ఇన్వో బైయో లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు మామిడి తోటలను సందర్శించి కాయల నాణ్యత సంతృప్తిగా ఉందన్నారు. రైతులు దళారుల వద్ద మోసపోకుండా ఎగుమతులకు అనువైన కాయలను తమకు వద్దకు చేరిస్తే ఎటువంటి కమిషన్ లేకుండా రైతులకు ఆదాయం సమకూరుతుందన్నారు. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలని కోరారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, రైతు సేవాకేంద్రం అధికారులు గీత, సుధాకర్, సూరి పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టండి

బుక్కపట్నం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వం పాఠశాలలో సమగ్రశిక్ష పరిధిలోని విద్యార్థులకు కరాటే శిక్షణకు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు దుర్వినియోగం చేశారని, దానిపై విచారణ చేపట్టాలని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఇండియా సెక్రటరీ భాస్కర్‌నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ దేవరాజుకు వినతిపత్రం అందజేశారు. నాలుగు సంవత్సరాలుగా ఈ తంతు కొనసాగుతోందన్నారు. ఇప్పటికైనా అధికారులు విచారణ చేసి, గోల్‌మాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎంఈఓపై ఆరోపణలు తగవు

కదిరి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కదిరి ఎంఈఓ చెన్నక్రిష్ణపై ఆరోపణలు చేయడం తగదని, ఆయనపై ఎలాంటి చర్యలూ తీసుకోరాదని ఎంఈఎఫ్ (మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్) జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్ ప్రకటనలో కోరారు. పదో తరగతి పరీక్షల నిర్వహణలో భాగంగా మండలానికి చెందిన కొంతమంది ఉపాధ్యాయులను పరీక్ష విధులకు పంపారని తెలిపారు. అదే సమయంలో వారు పనిచేస్తున్న పాఠశాలలు మూతపడకుండా ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేశారన్నారు. కొంతమంది ఆయనపై చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. అదేవిధంగా పదో తరగతి పరీక్షల్లో సస్పెండైన ఉపాధ్యాయులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా కొల్లాపురేశ్వరి అమ్మవారి ఉత్సవం

తనకల్లు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపిరెడ్డిపల్లిలో శుక్రవారం కొల్లాపురేశ్వరి అమ్మవారి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి ముందు మహిళలు కోలాటం, చెక్కభజనలు చేశారు. ప్రతి ఇంటి వద్ద అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.



అలంకరణలో అమ్మవారు

దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలో ఏడు గ్రామాలలో రీ సర్వే జరిగిందని, జాయింట్ పట్టాదారులుగా ఉండి భూ సమస్యలు పరిష్కారం కాని రైతులు శని, ఆదివారాల్లో మీ సేవ, లేదా గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీఓ సువర్ణ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆ దరఖాస్తులను పరిశీలించి పరిష్కారానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నీలకంఠారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పాడి రైతులకు అండగా..

- వేసవిలో చల్లటి కబురు..
- మూగజీవాల దప్పిక తీర్చడానికి నీటి తొట్టెలు
- జిల్లాకు 1,362 మంజూరు
- శ్రీకారం చుట్టిన కొత్త ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న పాడి రైతులు



డి.చెర్లోపల్లిలో నిర్మించిన నీటి తొట్టె

బత్తలపల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వర్షాభావం .. భూగర్భ జలాలూ ఇంకిపోయాయి. బావులు, బోర్లు ఎండిపోయాయి. పలు గ్రామాల్లో తాగు నీటి సమస్య తీవ్రంగా ఉంది. ఇక మూగజీవాల వ్యథ మరీ ఘోరం. గత టీడీపీ హయాంలో ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం గ్రామాల్లో పశువుల దప్పిక తీర్చడానికి నీటి తొట్టెలను ఏర్పాటు చేసింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం... వ్యవసాయ రంగంతో పాటు పాడి రంగాన్నీ పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దీంతో ఆ నీటి తొట్టెల గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. దీంతో అవి నిర్వహణ లేక.. శిథిలమయ్యాయి. పశువులు, గొర్రెల కాపరులు నీటి కోసం వాటిని కిలోమీటర్లు వెళ్లేవారు. ఆ బాధలను భరించలేక .. అనేక మంది పాడి రైతులు పశువులను అమ్ముకున్నారు. ప్రస్తుతం మళ్లీ చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రావడంతో.. పాడి రంగాన్ని అదుకునేలా చర్యలు చేపట్టారు. అందులో భాగంగా పశువుల దాహార్తి తీర్చేలా నీటి తొట్టెల నిర్మాణంపై దృష్టి సారించారు. దీంతో మూగ జీవాల యజమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

● వేగంగా పనులు

జిల్లాకు 1,362 నీటి తొట్టెలను నూతన ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రతి గ్రామానికి పశువుల సంఖ్య ఆధారంగా రెండు, మూడు తొట్టెలను మంజూరు చేసింది. వీటిని ఉపాధి హామీ పథకం కింద నిర్మిస్తున్నారు. ఒక్కో తొట్టెను రూ. 30 వేలతో నిర్మిస్తున్నారు. వీటిని ఈ నెల పదో తేదీలోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ తొట్టెలకు నీటిని సరఫరా చేసే బాధ్యత పంచాయతీలకు అప్పగించారు. జిల్లాలో 2.97 లక్షల ఆవులు, ఎద్దులు, 60 వేల గేదెలు, 29 లక్షల గొర్రెలు, మేకలు ఉన్నాయి.

ఆ నీరు పశువులకే..



వేసవి కాలంలో పశువుల దప్పిక తీర్చడానికే ఈ నీటి తొట్టెలను ప్రభుత్వం నిర్మిస్తోంది. ఈ తొట్టెల నిర్మాణం పూర్తి అయితే పాడి రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఈ తొట్టెల వద్ద ఎవరైన బట్టలు ఉతికినా.. స్నానాలు చేసినా.. వారిపై కేసులు పెడతాం.

-శుభదాస్, ఏడీ, పశువర్ధక శాఖ



ఎంఈఓతో మాట్లాడుతున్న బడేనాయక్ తండా ప్రజలు

ఆ సార్ వస్తే.. స్కూల్‌కు తాళమేస్తాం

ఎంఈఓకు స్పష్టం చేసిన బడేనాయక్‌తండా ప్రజలు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): బడేనాయక్‌తండాలోని మండల ప్రజాపరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడిగా శంకర్‌నాయక్ వద్దని, ఆయన వస్తే ఈ పాఠశాలకు తాళం వేస్తామని ఆ తండావాసులు తేల్చి చెప్పారు. వివరాల్లోకి వెళ్తే.. గతంలో బడేనాయక్‌తండా ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎంగా శంకర్‌నాయక్ పనిచేసేవారు. ఆయన మద్యం తాగి పాఠశాలకు వస్తున్నారని, పిల్లల భవిష్యత్‌ను చెడగొడతున్నారని విద్యాశాఖ ఉన్నతాధికారులకు తండావాసులు ఫిర్యాదు చేశారు. విచారణ చేసిన విద్యాశాఖ ఉన్నతాధికారులు అతన్ని సస్పెండు చేశారు. సస్పెన్షన్ తర్వాత మరో పాఠశాలకు బదిలీ చేయాల్సిన విద్యాశాఖాధికారులు... తిరిగి ఆ పాఠశాలకే ఉపాధ్యాయుడిగా నియమించారు. విధుల్లో చేరిన ఆయనలో ఎలాంటి మార్పు రాలేదని, తాగి విధులకు వస్తున్నారని మళ్లీ ఆ తండావాసులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంఈఓ ఖాదర్‌వలి విచారణ నిమిత్తం ఆ గ్రామానికి శుక్రవారం వెళ్లారు. ఆ తండావాసులు మాట్లాడుతూ.. అతన్ని తమ పాఠశాల నుంచి బదిలీ చేయాలని, లేకుంటే పాఠశాలకు తాళాలు వేస్తామని ఆ గ్రామస్థులు తేల్చిచెప్పారు.

సేంద్రియ సాగుతో అధిక లాభాలు



మీర్జాపురంలో పొలంబడి నిర్వహిస్తున్న అధికారులు

కొత్తచెరువు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సేంద్రీయ పద్ధతిలో పంటలను సాగుచేయడం వల్ల అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయాధికారి నటరాజ్ రైతులకు సూచించారు. మీర్జాపురం గ్రామంలో శుక్రవారం పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో ఆయన మాట్లాడుతూ... ఈ గ్రామానికి చెందిన రైతు వెంకటేశ్ సేంద్రీయ పద్ధతిలో పంటలను సాగుచేస్తున్నారని, ఆయన పంటలను ఇండ్‌గ్యాప్ సంస్థ వారు ప్రకృతి వ్యవసాయాన్ని పరీక్షించి అందులో రసాయనిక మందులు, ఎరువులు వాడకుండా ఉంటే ఆయనకు సర్టిఫికెట్ అందజేస్తారని అన్నారు. ఆ సర్టిఫికెట్ ఉంటే ఆ రైతు పండించిన పంటలను మార్కెట్‌లో అమ్ముకోవడానికి చాలా ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా రసాయనిక పద్ధతిలో పంటలు సాగుచేస్తుండటంతో ప్రజలు అనారోగ్యాల పాలు అవుతున్నారని, ఇటీవల అందరూ సేంద్రీయ సాగు వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌టీఓ క్యూఎంఎస్ మేనేజర్ గోపాలకృష్ణ, టెక్నికల్ అడ్వజర్ నటరాజ్, ఇంటర్నల్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ అశ్విని, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల అందజేత

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతులకు కలెక్టరేట్‌లో కలెక్టర్ టీఎస్ చేతన్ ఉపకరనాలను శుక్రవారం పంపిణీ చేశారు. జిల్లా విభిన్న ప్రతిభావంతుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో జేసీ అభిషేక్ కుమార్‌తో కలిసి కలెక్టర్ 17 మంది విభిన్న ప్రతిభావంతులు స్వయం ఉపాధి కోసం రూ.38.50 లక్షల విలువగల ఉపకరణాలు, పరికరాలు, వీల్‌చైర్లు అందించారు. 15 విద్యార్థులకు లాప్‌ట్యాబ్‌లు, 13మంది బంధిరలకు స్మార్టు ఫోన్లు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులనే భావనను పక్కన పెట్టి ఉన్నత లక్ష్యంతో విద్యను అభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో విభిన్నప్రతిభావంతుల జిల్లా అధికారి వినోద్, సిబ్బంది ఉన్నారు.



దివ్యాంగులకు వీల్‌చైర్ అందచేస్తున్న కలెక్టర్, జేసీ

తాగునీటి సమస్య పరిష్కారం



బోరును రిపేరీ చేస్తున్న సిబ్బంది

నంబులపూలకుంట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిన్నెమీదపల్లిలో తాగునీటి బోరు చెడిపోవడంతో తాగునీటి సమస్య నెలకొంది. దీనిపై ఆంధ్రజ్యోతి గురువారం ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన అధికారులు శుక్రవారం మండలంలోని దిన్నెమీదపల్లికి వెళ్లి పంచాయతీ బోరుకు మరమ్మతులు చేపట్టి గ్రామానికి తాగునీరు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరామిరెడ్డి, ఈఓఆర్డీ మాధవరెడ్డి పాల్గొన్నారు.

రహదారులు, వీధులు జలమయం



కొండకమర్లలో గ్రామీణ బ్యాంక్ వద్ద నిల్వ ఉన్న వర్షపు నీరు

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి పలు గ్రామాల్లో వీధులు జలమయం అయ్యాయి. మండల వ్యాప్తంగా 35.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కొండకమర్లలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన రహదారిపై వర్షపు నీరు భారీగా ప్రవహించింది. దీంతో రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. ఆ ప్రాంత వాసులు ఫిర్యాదుతో స్పందించిన కార్యదర్శి మద్దిలేటిరెడ్డి ఎక్స్‌కలేటర్‌తో వర్షపు నీటిని దారి మళ్లించారు. అలాగే అల్లాపల్లి గ్రామంలో సిమెంటు రోడ్డు తక్కువ ఎత్తులో ఉండటంతో వర్షపు నీరు నిలవడంతో ఆ ఆప్రాంత వాసులు ఇబ్బందులు పడ్డారు.


గొట్లూరు ఆంజనేయస్వామి ఆలయ ధర్మకర్త ఏకగ్రీవం



ఆలయ ధర్మకర్తను సన్మానిస్తున్న నాయకులు

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరులోని ఆంజనేయస్వామి దేవాలయ కమిటీ ధర్మకర్తగా కోడెకండ్ల వీరనారప్పను ఎన్‌డీఏ కూటమి నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో పాత ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు సమావేశమై.. నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా కోడెకండ్ల వీరనారప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన కమిటీ ధర్మకర్తగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ను టీడీపీ నాయకులు గొట్లూరు శ్రీనివాసులు, అమరేంద్ర, బీజేపీ మండల కన్వీనర్ గొట్లూరు చంద్ర, సన్మానించారు.

నేటి నుంచి లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు



బుక్కపట్నం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ పురోహితులు హరిస్వామి, గురుస్వామి తెలిపారు. శనివారం అంకురార్పణలో ఈ ఉత్సవాలు ప్రారంభమై ఈ నెల 15తో ముగుస్తాయన్నారు. 10న గరుడవాహన సేవ, 11న కల్యాణోత్సవం, 12న రథోత్సవం నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని జయప్రదం చేయాలని కోరారు.

శ్రీరామనవమి ప్రశాంతంగా జరుపుకోండి: ఎస్పీ

పుట్టపర్తి రూరల్ ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పర్వదినాన్ని జిల్లా ప్రజలందరూ ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ వీ.రత్న సూచించారు. శుక్రవారం మండలంలోని కరావులపల్లి తండా వద్ద శ్రీరామనవమి పర్వదిన వేడుకల సందర్భంగా ఆనవాయితీగా నిర్వహించే ఎండ్లబండ పోటీలు నిర్వహించే ప్రదేశాన్ని ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కరావులపల్లిలో ఎండ్లబండి పోటీల నిర్వాహకులు సమస్యలు తలెత్తకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకుని ప్రశాంతంగా పోటీలను నిర్వహించుకోవాలన్నారు. వేడుకలకు మహారాష్ట్ర మంత్రి సంజయ్‌రాథోడ్ హాజరవుతున్నారని, ఈ సందర్భంగా పలు జాగ్రత్తలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీసు అధికారులకు సూ చించారు. ఆమె వెంట డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఏఆర్‌డీఎస్పీ శ్రీనివాసులు, స్పెషల్‌బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, గోరంట్ల సీఐ శేఖర్ ఉన్నారు.



ఎండ్లబండి పోటీల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

● తనకల్లు: మండలంలోని రాచువారిపల్లి గ్రామంలో ఆదివారం శ్రీరామ నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు పూర్తి చేశామని ఆ గ్రామస్థులు శుక్రవారం తెలిపారు. ఆ రోజున గ్రామంలో ఊరేగింపు నిర్వహించడానికి ఉత్సవ విగ్రహాలను సిద్ధం చేశామన్నారు. తామంతా చందాలు వేసుకొని.. రూ.లక్షకుపైగా వెచ్చించి విగ్రహాలను తయారు చేయించామన్నారు.

● నల్లచెరువు మండలంలోని పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయం వద్ద శ్రీరామి నవమి సందర్భంగా ఆదివారం నిర్వహించే సీతారాముల కల్యాణానికి ఏర్పాటును పూర్తిచేసినట్లు కార్యనిర్వాహణాదికారి రవీంద్రరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివా రం ఉదయం 11గంటలకు ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తామని, అధిక సంఖ్యలో భక్తులు హాజరుకావాలని కోరారు.

క్రైం న్యూస్..

మహిళ ఆత్మహత్య

కదిరి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటి పరిధిలోని కుటాగుళ్లలో చంద్రకళ (18) అనే వివాహిత శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. పట్టణ ఎస్ఐ బాబ్‌జాన్ తెలిపిన వివరాల మేరకు.. బోయ రామన్నగారి పల్లికి చెందిన చంద్రకళ రెండు నెలల కిందట కుటాగుళ్లకు చెందిన చిన్నాను ప్రేమించి పెళ్లి చేసుకుంది. శుక్రవారం కుటాగుళ్లలోని అత్తింటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. చుట్టుప్రక్కల గమనించి.. మృతదేహాన్ని కిందకు దింపి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.. మృతురాలు తల్లి రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

యువతి అదృశ్యం

కదిరి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక అడపాలవీధిలో నివాసముంటున్న శ్రీనివాసులు కుమార్తె పట్టణంలో ఓ గార్మెంట్ షాప్‌లో పని చేస్తోంది. ఈనెల 2వ తేదీ గార్మెంట్ షాపునకు వెళ్లిన ఆ యువతి తిరిగి ఇంటికి రాలేదు. రెండు రోజుల పాటు అన్ని చోట్లా గాలించినా.. ఫలితం లేకుండా పోయింది. దీంతో శ్రీనివాసులు శుక్రవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నారాయణ రెడ్డి తెలిపారు.

బాలిక..

కదిరిఅర్బన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రానికి చెందిన ఓ బాలిక ఈ నెల రెండో తేదీన పని నిమిత్తం కదిరికి వెళ్లింది. ఆ బాలికి తిరిగి ఇంటికి చేరకపోవడంతో కుటుంటసభ్యులు పలుచోట్ల గాలించారు. ఫలితం లేకపోవడంతో ఆ బాలిక తల్లిదండ్రులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ నీరంజన్‌రెడ్డి తెలిపారు.

ఆటోడ్రైవర్ నిజాయతీ

ఆటోలో దొరికిన సెల్‌ఫోన్ పోలీసులకు అప్పగింత



బాబావలిని సన్మానిస్తున్న ఎస్ఐ

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): దొరికిన సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించి, ఆటోడ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. మండలంలోని కుణుతూరు గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ బాబావలి శుక్రవారం గ్రామం నుంచి ధర్మవరానికి తన ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని వదిలేశాడు. ఓ ప్రయాణికుడికి చెందిన రూ.30 వేల విలువైన సెల్‌ఫోన్ ఆటోలో పడిపోయింది. సెల్‌ఫోన్‌ను గమనించిన ఆటోడ్రైవర్ బాబావలి రూరల్ పోలీసులకు అప్పజెప్పాడు. ఎస్ఐ శ్రీనివాసులు ఫోన్‌లోని నంబర్ల ఆధారంగా విచారించి, దేవదాయ శాఖాధికారిదిగా గుర్తించి, ఆయనకు సెల్‌ఫోన్ అందించారు. ఆటో డ్రైవర్ బాబావలిని ఎస్ఐ శ్రీనివాసులు శాలువాకప్పి, సన్మానించారు.

పంటల సాగుపై ఆరా



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ

ముదిగుబ్బ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీతో సరఫరా చేసిన ఉలవలు, పెసర విత్తనాలతో సాగు చేసిన పంటలపై వ్యవసాయ శాఖ ఏడీఏ రోజా పుష్పలత ఆరా తీశారు. శుక్రవారం స్థానిక మూడో సచివాలయంలో ఆ రైతులతో ఆమె మాట్లాడారు. ఎంతమంది ఉలవలు, పెసర పంట సాగు చేశారు.. ఎంతమంది సాగు చేయలేదు.. పంట సాగు చేసిన రైతులకు దిగుబడి ఎంత వచ్చింది.. అనే అంశాలను ఆరా తీశారు. రైతులు మాట్లాడుతూ.. ఉలవలను చల్లడం జరిగిందని, మొలక దశలోనే పంట దెబ్బ తిందన్నారు. కొంతమంది రైతులు దిగుబడి సరిగ్గా రాలేదని, ధర లేక ఇంటిలోనే ఉంచుకున్నట్లు వివరించారు. రైతులతో సేకరించి వివరాలతో నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. సబ్సిడీతో ఉలవలను తీసుకొని పంటను సాగు చేయని వారి నుంచి వివరాలు అడిగి తీసుకున్నారు. కార్యక్రమంలో ఏఓ ఉమామహేశ్వరి, ముదిగుబ్బ వ్యవసాయ అధికారి లక్ష్మీనరసింహులు, ఏఈఓ సర్ఫుద్దీన్, వ్యవసాయ సిబ్బంది అనిత, మానస, ఆశ, రైతులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.3 లక్షల విరాళం



చెక్కు అందజేస్తున్న ఎలుగోటి సత్యనారాయణప్ప

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక సాయినగర్‌లోని షిర్డిసాయిబాబా ఆలయంలో అన్నదానం చేసేందుకు పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు ఎలుగోటి సత్యనారాయణప్ప రూ. మూడు లక్షలను విరాళంగా ఇచ్చారు. శుక్రవారం ఆయన ఆలయంలో సేవాసమితి సభ్యులకు ఆ చెక్కును అందజేశారు.

విద్యార్థులకు అభినందన

కదిరి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎంటర్‌ప్రెనర్‌షిప్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఎక్స్‌పోలో ప్రతిభ కనబరిచి ద్వితీయ బహుమతి పొందిన కుటాగుళ్ల మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులను కదిరి ఎంఈఓ చెన్నక్రిష్ణ శుక్రవారం అభినందించారు. ఆయన పాఠశాలను సందర్శించి ఆ ప్రాజెకును పరిశీలించారు. యాంటీస్లీప్ అలారం ప్రాజెక్టు మోడల్‌ను తయారు చేసిన ఎం. అనీస్, రతీబ్ ఖాన్, సుహెల్, ఫైజాన్‌ను, వారికి సహకరించిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

13న కంటి వైద్య శిబిరం

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 13న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీక్లబ్ ప్రెసిడెంట్ జయసింహ తెలిపారు. శుక్రవారం రోటరీక్లబ్ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేసిన ఆయన మాట్లాడారు. కంటి పరీక్షలు వచ్చేవారు తప్పనిసరిగా ఆధార్ కార్డు గానీ, రేషన్‌కార్డు, ఓటరుగుర్తింపు కార్డుల జిరాక్స్ పత్రాలు, 3 పాస్ ఫొటోలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు నాగభూషణ, సుదర్శనగుప్తా, క్యాంపు చైర్మన్ నాగభూషణ, ప్రసన్నకుమార్, రమేష్‌బాబు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

న్యూస్ బాక్స్

మారెమ్మ ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించండి


మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో 14 నుంచి 19వతేదీ వరకు కనుమ మారెమ్మ ఉత్సవాలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి సూచించారు. ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం కనుమ మారమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు, నగర పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించారు. దాదాపు పది సంవత్సరాల అనంతరం కనుమ మారమ్మ ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారని, అందుకు ముందస్తుగానే ఏర్పాట్లు చేయాలని పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో నగర పంచాయతీ అధికారులు, కనుమ మారమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు, పట్టణ పెద్దలు తదితరులు హాజరయ్యారు.

భూసార పరీక్షలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రైతులు భూసార పరీక్షలపై అవగాహన కల్పించాలని జిల్లా ఉద్యానశాఖాధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం పెనుకొండలో హిందూపురం, పెనుకొండ, మడకశిర, కొత్తచెరువు, తదితర మండలాల విలేజ్, అగ్రికల్చర్ అసిస్టెంట్లకు ఈమిర్చా ఓరియంటేషన్ వర్క్‌షాపు నిర్వహించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసర్చ్ అభివృద్ధిచేసిన కిట్‌లను ఉపయోగించి భూసార పరీక్షలు చేయడంపై శిక్షణ ఇచ్చారు. హెచ్ఓ రాంప్రసాద్, ఉద్యానశాఖాధికారి మహేష్‌నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం


విద్యార్థిని సన్మానిస్తున్న దృశ్యం

గోరంట్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జమియత్ ఉల్మా కమిటీ ఆధ్వర్యంలో గోరంట్లకు చెందిన విద్యార్థి షేక్ షంషీర్ డిప్లొమా సివిల్ ఇంజనీరింగ్ విభాగంగలో గోల్డ్ మెడల్ సాధించినందుకు శుక్రవారం విద్యార్థిని సన్మానించారు. తిరుపతిలోని మోహన్‌బాబు డీమ్డ్ యూనివర్సిటీలో మూడేళ్ల డిప్లొమా సివిల్ ఇంజనీరింగ్‌లో షేక్ షంషీర్ ప్రతిభ కనబరిచారు. జమియత్ ఉల్మా మండలాధ్యక్షుడు మౌలానా షఫీవుల్లాసాబ్ ఆధ్వర్యంలో విద్యార్థికి రూ.పదివేల నగదు పారితోషికం ఇచ్చి శాలువతో సత్కరించారు. నాయకులు అబ్దులా, హాఫీస్‌జావీద్, యజాజ్, అజంతుల్లా పాల్గొన్నారు.

కమిటీ ఎంపిక


ఎంపికైన నూతన కమిటీ సభ్యులు

సోమందేపల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక పాతూరులో వెలసిన కాళమ్మ దేవాలయంలో యాదవ సంఘం నూతన కమిటీని శుక్రవారం ఎంపిక చేశారు. సంఘం గౌరవాధ్యక్షులుగా ఏజీ లక్ష్మీనరసింహులు, కొత్తపల్లి వెంకటరమణయాదవ్, అధ్యక్షుడిగా మహేష్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా అమర్నాథ్ యాదవ్, మధుయాదవ్, ప్రధాన కార్యదర్శిగా గోపాల్‌యాదవ్, కార్యదర్శులుగా కొత్తపల్లి ఆంజనేయులు, నాగరాజుయాదవ్, కోశాధికారిగా ఏజీ నరసింహమూర్తి, ప్రచార కార్యదర్శిగా డీలర్ రమేష్, సలహాదారులుగా నరసింహులుయాద వ్, నల్గొండ్రాయనపల్లి విజయభాస్కర్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం


ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఏబీఎం జయప్రకాష్

గోరంట్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను శుక్రవారం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ సీఎస్ఆర్ నిధులు రూ.1.50లక్షల వ్యయంతో ఐడీబీఐ బ్యాంక్ ద్వారా మూడు కంప్యూటర్లు, ఇన్వర్టర్‌ను మంజూరు చేశారు. గురుకులం, సొసైటీ సహకారంతో మరో ఐదు కంప్యూటర్లను ఏర్పాటు చేశారు. ల్యాబ్‌ను ధర్మవరం ఐడీబీఐ బ్యాంక్ ఏజీఎం జయప్రకాష్, జిల్లా గిరిజన సంక్షేమాధికారి మోహన్‌రామ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

హిందూపురం అర్బన్, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని పాంచజన్య పాఠశాలలో శుక్రవారం గ్రాడ్యుయేషన్‌డేను ఘనంగా నిర్వహించారు. పాఠశాల అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు వివిధ రంగాల్లో ఆప్రవీణ్యతను సాధించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులను ప్రోత్సహిస్తే చురుకుదనం అలవడుతుందన్నారు. కార్యదర్శి నందకుమార్, ఏఓ స్మిత, నందిత, హెచ్‌ఎం గాయిత్రి, ఏఓ భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, ఏహెచ్‌ఎంలు శశికళ, సతీష్, అబ్దుల్ రజాక్, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న విద్యార్థులు, యాజమాన్యం

అధైర్యపడకండి.. అండగా ఉంటా: మంత్రి


మహ్మద్‌ఖాన్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): అధైర్యపడకండి తెలుగుదేశం పార్టీ మీకు ఎల్లవేళలా అండగా ఉంటుందని మహ్మద్‌ఖాన్ కుటుంబానికి మంత్రి సవిత భరోసా ఇచ్చారు. పెనుకొండ మండలం నాగలూరు గ్రామ మాజీ సర్పంచ్ మహ్మద్ ఖాన్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న మంత్రి శుక్రవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించి అధైర్యపడకండి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మంత్రి వెంట మాజీ జడ్పీటీసీ నారాయణస్వామి, మండల కన్వీనర్ సిద్దయ్య, ఈశ్వరప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులపై స్పందించిన మంత్రి

గోరంట్ల: పట్టణంలోని బస్టాండ్ కూడలినుంచి రావికుంట చెరువుకట్ట వరకు ఆగిన బైపాస్‌రోడ్డు విస్తర్ణ పనులపై మంత్రిసవిత స్పందిస్తూ అధికారులు చర్యలు చేపట్టాలని శుక్రవారం ఆదేశించారు. రహదారిని గోరంట్ల పంచాయతీ డబుల్‌రోడ్డుగా అభివృద్ధి చేయడానికి గతంలో చర్యలు చేపట్టింది. భవన నిర్మాణాల తొలగింపు విషయంలో వివాదంచోటు చేసుకోవడంతో కొన్నేళ్లుగా పనులు నిలిచిపోయాయి. సర్పంచ్ సరోజ భర్త టీడీపీ నాయకుడు నాగేనాయక్, మండలకన్వీనర్ సోముశేఖర్ మంత్రితో చర్చించారు. మంత్రి ఆర్అండ్‌బీ డీఈ వెంకటరామిరెడ్డి, ఏఈ శ్రీనివాసులును పిలిపించి మాట్లాడారు. రెవెన్యూ సబ్‌డివిజన్ మేరకు 60 అడుగుల బైపాస్‌రోడ్డు ఉన్నట్లు రికార్డులో తేలడంతో, వెంటనే సంబధిత భవన యజమానులకు నోటీసులు జారీ చేసి, ఖాళీ చేయించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు.

బాధిత కుటుంబానికి పరిహారం అందజేత

పెనుకొండ టౌన్, : విద్యుత్‌షాక్‌కు గురై 2024లో మృతిచెందిన అలివేలమ్మ కుటుంబానికి రూ.5లక్షలు మంత్రి సవిత మంజూరు పత్రాన్ని అందజేశారు. శుక్రవారం మంత్రి నివాసంలో ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్ర బాబు చేతులమీదుగా బాధితులకు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ 2024అక్టోబర్‌లో అలివేలమ్మ ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిందని ఆమె కుటుంబానికి అండగా ఉండాలని చెక్కును అందజేసినట్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లాకు మరిన్ని పరిశ్రమలు

ఉమ్మడి అనంత జిల్లాలో మరిన్ని పరిశ్రమలు రానున్నాయని ఏపీఐఐసీ ఛైర్మన్ మద్దెన రామరాజు పేర్కొన్నారు. శుక్రవారం మంత్రి సవిత ఇంటికి వచ్చిన ఆయనకు పూలహారాలతో ఘనంగా స్వాగతించారు. మంత్రి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉన్నత చదువులు చదివారని వారందరికీ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మరిన్ని పరిశ్రమలు తీసుకురావాలని సూచించినట్లు తెలిపారు.


ఏపీఐఐసీ ఛైర్మన్‌ను సన్మానిస్తున్న మంత్రి సవిత

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన


ర్యాలీగా వస్తున్న ముస్లింలు

హిందూపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో ఆమోదించిన వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే రద్దుచేయాలని శుక్రవారం హిందూపురంలో వైసీపీ నాయకులు, ముస్లింలు ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. అంబేడ్కర్ సర్కిల్ నుంచి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయంలో డీటీ మైనుద్దీన్‌కు వినతిపత్రం అందించారు. వైసీపీ నాయకులు వేణురెడ్డి మాట్లాడుతూ ముస్లింలకు నష్టం కలిగించే వక్ఫ్ సవరణ బిల్లును రద్దుచేయాలన్నారు.

ఇంటర్ సెకెండియర్ తరగతులు ప్రారంభం

పెనుకొండ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ సుదర్శన్ తెలిపారు. విద్యార్థులు తప్పక హాజరు కావాలని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటుపుస్తకాలు, రికార్డులు, ఐఐటీ, జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు కూడా ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజన వసతిని ఉపయోగించుకోవాలన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు 7నుంచి తరగతులు ప్రారంభం అవుతాయన్నారు. టెన్త్ హాల్‌టికెట్, ఆధార్ జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్‌సైజు ఫొటోలతో కళాశాల కార్యాలయంలో అందజేసి అడ్మిషన్ పొందాలన్నారు. 23వరకు తరగతులు నిర్వహిస్తామని, 24నుంచి వేసవి సెలవులు ప్రారంభమై తిరిగి జూన్ 2న కళాశాల ప్రారంభం అవుతుందన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

అగళి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 2009 పూర్వ విద్యార్థులు రూ.20వేలు విలువచేసే మైక్‌సెట్‌ను వితరణగా హెచ్ఎం వరదరాజులుకు అందజేశారు. ఈ సందర్భంగా అప్పటి విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

భూములను రైతులకు అప్పగించాలి

మడకశిరటౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సి.కొడిగేపల్లి, కల్లుమర్రి పంచాయతీ పరిధిలో 2004-05లో పరిశ్రమల కోసం సేకరించిన భూములను తిరిగి రైతులకు అప్పగించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న కోరారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కరుణాకర్‌కు వినతిపత్రం అందజేశారు. రైతుల వద్ద భూములు సేకరించి పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని, అయినా ఇంతవరకు కల్పించలేదన్నారు. కార్యక్రమంలో రైతు, ఆనంద రంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోండి

అగళి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కుట్టు శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ ఉమేష్ కోరారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని ఆర్టీటీ భవనంలో కుట్టుశిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న మహిళలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండు బ్యాచులుగా విభజించామని, ఒక్కో బ్యాచు 60 మంది చొప్పున ఉంటారన్నారు. ఉదయం 9నుంచి 60మంది, మధ్యాహ్నం 1గంట నుంచి మరో 60మందికి శిక్షణలు ఉంటాయన్నారు. మండలం వ్యాప్తంగా 120మంది మహిళలు శిక్షణ తీసుకుంటారన్నారు. ట్రైనర్ రేఖ, వాల్మీకి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్, శ్రీనివాస్, రాజగోపాల్, భూతరాజ్, మహిళలు పాల్గొన్నారు.

నేటి విద్యార్థులే రేపటి పౌరులు

హిందూపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): నేటి విద్యార్థులే రేపటి పౌరులని ఎంఈఓ గంగప్ప అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నగుడ్డంపల్లిలో ప్రాథమిక పాఠశాలలో సరస్వతిపూజ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకుని గ్రామానికి, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పాఠశాలలో 18ఏళ్లు పనిచేసిన పూర్వ హెచ్ఎం నాగమణికి ఉపాధ్యాయులు పద్మావతి, ప్రమీళ సన్మానించారు. కార్యక్రమంలో ఐటీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

పరిగి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత శనివారం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ గోవిందప్ప తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు పైడేటికి వెళ్లేదారిలో రూ.కోటితో ఏర్పాటుచేసిన సీసీరోడ్డును ప్రారంభించనున్నారు. 3.30గంటలకు తిరుమలదేవరపల్లి, విట్టాపల్లి మధ్య రూ.కోటితో నూతన రోడ్డుకు భూమిపూజ చేయనున్నారు. సాయంత్రం 4గంటలకు ఊటకూరు, అక్కంపల్లి మధ్య రూ.కోటితో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజలో పాల్గొనున్నట్లు తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ: మండలంలోని పెద్దరెడ్డిపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కుటుంబాన్ని మంత్రి సవిత శుక్రవారం పరామర్శించారు. గురువారం మట్టిపెళ్లలు పడి కార్యకర్త హేమంత్ మృతిచెందిన విషయం తెలుసుకున్న మంత్రి గ్రామానికి చేరుకుని భౌతికకాయాన్ని సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

104, 105 జీఓలను రద్దు చేయండి

పెనుకొండ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రైతులకు నష్టం కలిగించే 104, 105 జీవోలను రద్దుచేసి హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను నిలిపివేసి, కాలువ వెడల్పు చేయాలని మంత్రి సవితకు రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. శుక్రవారం రైతు సంఘం జిల్లా కార్యదర్శి హరి, ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న మంత్రిని కలిశారు. వారు మాట్లాడుతూ హంద్రీనీవా ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలలో 3.45లక్షల ఎకరాలకు నీరందుతున్నాయన్నారు. జీఓలను రద్దుచేసి లైనింగ్ పనులు ఉపసంహరించుకోవాలన్నారు. సీఐటీయూ నాయకులు బాబావలి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గంగాధర్, ఫక్రుద్దీన్, లక్ష్మీనరసప్ప పాల్గొన్నారు.

రేపు ఖమ్రుద్దీన్ అలీ గంధం ఉరుసు

పెనుకొండ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోనిపేట రోడ్డులో వెలసిన షేక్ సయ్యద్‌షా మహ్మద్ ఖమ్రుద్దీన్ దర్గాలో ఆదివారం స్వామి గంధం ఉరుసు మహోత్సవాన్ని ఎంక్యూ గ్లోబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ఛైర్మన్ కలీముల్లా తెలిపారు. కులమతాలకు అతీతంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవంలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మడకశిర రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): హిందూపురం వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ 400 కేవీలైన్ మరమ్మతులు చేపడుతుండటంతో మడకశిర 132 కేవీ విద్యుత్ పరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ రఘు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి సాయంత్ర 5 గంటల వరకు 3ఫేజ్ కరెంట్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. నీలకంఠాపురం, ఆర్ అనంతపురం, వైబీ హళ్ళి, కదిరేపల్లి, కల్లుమర్రి సబ్ స్టేషన్ పరిధిలోని రైతులు, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రెండో తేదీ అంబేడ్కర్ నాటక ప్రదర్శన

సోమందేపల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సంఘం శరణం గచ్ఛామి పేరిట మే 2వ తేదీన ప్రదర్శించనున్న అంబేడ్కర్ నాటకాన్ని జయప్రదం చేయాలని శుక్రవారం కేవీపీఎస్ నాయకులు కరపత్రాలు విడుదల చేశారు. జిల్లా అధ్యక్షుడు హనుమయ్య మాట్లాడుతూ అంబేడ్కర్ జీవిత గాథను తెలిపే నాటికను పట్టణంలోని మార్కెట్ రోడ్డులో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. నాయకులు ప్రకాశ్, నాగరాజు, రవి, నరసింహులు, కేవీ రాజు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రామదాసు

మడకశిరటౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా రామదాసును నియమిస్తూ శుక్రవారం జిల్లా అధ్యక్షుడు జి.ఎం.శేఖర్ వెల్లడించినట్లు ఆపార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం తెలిపారు. మండలంలో పార్టీ అభివృద్ధి కోసం రామదాసు ఎంతో కృషి చేశారని, దీంతో ఆయనను మండల అధ్యక్షులుగా నియమించినట్లు తెలిపారు.

డీఎస్సీకి ఉచిత శిక్షణ

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న మెగా డీఎస్సీకి ఇప్పటికే టెట్ పరీక్షల్లో ఉత్తీర్ణ సాధించిన విద్యార్థులకు ఉచితంగా ఆన్‌లైన్ కోచింగ్ నిర్వహిస్తున్నట్లు సత్యసాయి జిల్లా వెనుకబడిన సంక్షేమ సాధికారిత అధికారి నిర్మలాజ్యోతి ఒక ప్రకటనలో పేర్కొన్నట్లు ఏఎస్‌డబ్ల్యూ సుబ్బరాయుడు తెలిపారు. అయితే ఈ కోచింగ్ బీసీ, ఈబీసీ అభ్యర్థులు మాత్రమే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. టెట్ మార్కుల ఆధారిత జాబితా ద్వారా ఎంపిక చేస్తామన్నారు. ఇందుకోసం టెట్ అర్హత మార్కుల జాబితా నేటివిటీ సర్టిఫికెట్, కుల, ఆదాయ, ఆధార్ ధృవీకరణ పత్రాలు, 2 పాస్‌పోర్టు ఫొటోలు ఆన్‌లైన్ ద్వారా పంపాలన్నారు. ఇందుకు 8వ తేదీ ఆఖరు అన్నారు.

బడిలో భోజనం ఆలస్యం

● తక్కువ బియ్యం.. గుడ్లతో సర్దుబాటు..?


11.40 గంటల సమయంలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో విద్యార్థులకు భోజనం ఆలస్యమౌతోంది. ఒంటిపూట బడి నేపథ్యంలో విద్యార్థులు ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పాఠశాలలో ఉంటున్నారు. మధ్యాహ్న భోజనాన్ని ఉదయం 10.30కే వడ్డించాలి. కానీ శుక్రవారం ఉదయం 11.40 గంటలకు వడ్డించారు. దీంతో ఉదయం ఏమీ తినకుండా వచ్చిన విద్యార్థులు ఆకలితో ఇబ్బంది పడ్డారు. హెచ్ఎం బియ్యం ఆలస్యంగా ఇవ్వడంతో వంట తయారీ ఆలస్యమైందని వంట మనిషి అన్నారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు పోనూ 480 మంది ఉన్నారని, ఒక ప్యాకెట్ బియ్యాన్ని మూడు రోజులకు సర్దుకోమంటున్నారని అన్నారు. రోజుకు ఒక పాకెట్ బియ్యం ఖర్చు అవుతుందని, హెచ్‌ం మాత్రం 3 రోజులకు ఒక పాకెట్ ఇస్తున్నారని తెలిపారు. రోజుకు 13 క్రేట్‌ల కోడి గుడ్లు ఇవ్వాల్సి ఉండగా 5 క్రేట్లు మాత్రమే ఇస్తున్నారని అన్నారు. ప్రభుత్వం నుంచి ఇండెంట్ ప్రకారం బియ్యం, గుడ్లు అందుతున్నా విద్యార్థులకు సరిగా అందడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. కాగా, డిప్యూటీ డీఈఓ సూచన మేరకే భోజనం ఆలస్యంగా పెడుతున్నామని హెచ్ఎం సామ్రాజ్యం అన్నారు. రాగి జావ ఇచ్చిన సమయంలో మాత్రమే మధ్యాహ్నం 12.30 భోజనం పెట్టమని సూచించామని, మిగిలిన రోజుల్లో ముందుగానే పెట్టమన్నామని డిప్యూటీ డీఈఓ పద్మప్రియ అన్నారు. ఒంటి పూట బడి నేపథ్యంలో పిల్లలకు ఇబ్బంది లేకుండా సరైన సమయానికి భోజనం పెట్టేలా హెచ్ఎంలు చూసుకోవాలని అన్నారు.


ఆలస్యంగా భోజనం తింటున్న విద్యార్థులు


ఉత్సవాలకు ముస్తాబైన కోడూరు తోపులోని కోదండ రామాలయం

కోదండ రామస్వామి ఉత్సవాలు ప్రారంభం

● 7న బ్రహ్మరథోత్సవం

చిలమత్తూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని పురస్కరించుకొని నిర్వహించే కోదండ రామస్వామి ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. కొన్ని వందల సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఉత్సవాలను ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించడానికి కోడూరు గ్రామ ప్రజలు సిద్ధమయ్యారు. గతంలో ఎద్దుల పరుష ప్రధాన ఆకర్షణగా ఉండేది. వేల సంఖ్యలో పశువులు తరలివచ్చేవి. రానురాను పశువుల సంఖ్య తగ్గిపోవడంతో కేవలం స్వామి వారి ఉత్సవాలకు మాత్రమే పరిమితమైంది. 9 రోజుల పాటు ఆలయంలో వెలసిన సీతారామలక్ష్మణ హనుమంతులకు నిత్యపూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. 7న శ్రీరామ నవమి రోజున స్వామి వారి బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తారు. ఉత్సవానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. శనివారం ధ్వజారోహణం, ఆదివారం ధూపోత్సవం, పానక పూజతో పాటు స్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు. సోమవారం బ్రహ్మరథోత్సవం, మంగళవారం హనుమతోత్సవం, బుధవారం రాత్రి పూలపల్లకి, గురువారం గురుడోత్సవం, 11వ తేదీన ముత్యాల పల్లకి, సంగీత కచేరి, 12న వసంతోత్సవం, రాత్రికి నయనోత్సవం, 13న విశ్వరూప దర్శనంతో ఉత్సవాలు ముగుస్తాయి..

నవమి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోండి: ఎస్పీ


ఆలయ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రత్న, అధికారులు

గోరంట్ల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శ్రీరామినవమి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ రత్న కోరారు. శుక్రవారం మండలంలోని కరావులపల్లి తండా వద్ద ఉన్న శివ ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం నవమి సందర్భంగా ఎడ్లబండ్లపోటీలు నిర్వహిస్తున్నారు. వేడుకలలో ముఖ్య అతిథిగా మహారాష్ట్ర మంత్రి సంజయ్‌రాథోడ్, రాష్ట్ర మంత్రి సవిత, ఎంపీ పార్థసారథి, పలువురు ఐఏఎస్, ఐపీఎస్‌లు హాజరువుతున్నారు. ఏర్పాట్లపై ఎస్పీ ఆలయ ప్రాంతాన్ని సందర్శించి హెలిప్యాడ్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. డ్రోన్ కేమేరాతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఎడ్లబండ్ల పోటీలో ఆలయ ధర్మకర్త శంకర్‌లాల్‌నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం ఆనవాయితీ. ఆమెతోపాటు తహసీల్దార్ మారుతి, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, బాలసుబ్రమణ్యంరెడ్డి, సీఐ శేఖర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పులేకమ్మ అమ్మవారి గ్రామోత్సవాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణ పరిధిలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న పులేకమ్మ ఆలయంలో ఉగాది తరువాత నగరోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శుక్రవారం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో ఉంచి ఊరేగించారు. మూల విరాట్‌కు పట్టు చీర, నగలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.


అలంకరణలో అమ్మవారు

అసాంఘిక శక్తుల ఆట కట్టిస్తాం: సీఐ

సోమందేపల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సోమందేపల్లి మండలంలో అసాంఘిక, అరాచక శక్తుల ఆటకట్టిస్తామని సీఐ రాఘవన్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో గంజాయి, అక్రమ మద్యం, ఆన్‌లైన్ మట్కా, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలను పూర్తిస్థాయిలో నిర్మూలిస్తామన్నారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేశామన్నారు.

హత్యకేసులో నిందితుడి అరెస్ట్


సోమందేపల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సాయినగర్‌లో మంగళవారం జరిగిన కుటుంబ ఘర్షణలో నారాయణ(32) మృతికి కారకులైన మారెప్పను శుక్రవారం నల్లగొండ్రాయనపల్లివద్ద అరెస్ట్‌చేసినట్లు సీఐ రాఘవన్ తెలిపారు. సోమందేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మారెప్ప అక్క యశోద సంసారాన్ని చక్కదిద్దే విషయమై గత కొంతకాలంగా వారిమధ్య మనస్పర్థలు, గొడవలు జరుగుతుండేవన్నారు. మృతుడు నారాయణ, లింగన్న కుమారుడు నరసింహులు అతని స్నేహితుడు గణేష్‌కు డబ్బులు అప్పుగా ఇచ్చారన్నారు. ఈ విషయమై వారిరువురు సోమవారం రాత్రి గొడవపడుతుండగా మారెప్ప కలుగజేసుకుని గణేష్‌కు మద్దతుగా వెళ్లాడన్నారు. ఈ విషయంలో అతని తల్లి మందలించిందన్నారు. కక్షను పెట్టుకుని మరుసటిరోజు మధ్యాహ్నం మారెప్ప తనతల్లిపై దాడిచేశాడన్నారు. ఆమెను కాపాడటానికి యశోద భర్త నారాయణ, అన్న అంజిలపై మారెప్ప కర్రలతో దాడిచేయగా నారాయణ అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. నారాయణ భార్య యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు తెలిపారు. నిందితుడిని శుక్రవారం అరెస్ట్‌చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

తేనెటీగల దాడిలో వ్యక్తికి గాయాలు

రొళ్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.డి.పల్లి గ్రామానికి చెందిన రైతు మారేగౌడ్‌పై శుక్రవారం తేనెటీగలు దాడి చేసి గాయపరిచాయి. వివరాల్లోకి వెళితే రైతు మారేగౌడ్ తన పొలంలో పనిచేస్తుండగా పక్కనే ఉన్న తేనెపట్టును కోతులు కదిలించడంతో తేనెటీగలు అతనిపై దాడి చేశాయి. గుర్తించిన స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ ప్రథమ చికిత్సలు అందించి మెరుగైన వైద్యం కోసం మడకశిర ఆస్పత్రికి తరలించారు.

కర్ణాటక బస్సు బోల్తా

● స్వల్పగాయాలతో బయటపడ్డ ప్రయాణికులు


బోల్తా పడిన బస్సు

అమరాపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.శివరం గ్రామ సమీపంలో కర్ణాటక రాష్ట్రం పావగడ తాలూకా సాసులకుంట గ్రామం నుంచి బెంగళూరుకు ఉదయం 4 గంటలకు బయలుదేరిన బస్సు 4.30 గంటల సమయంలో బోల్తా పడింది. బస్సు మొత్తం ప్రయాణికులతో నిండి ఉంది. బస్సు ఉన్న ఫళంగా అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. సమాచారం అందుకొన్న అమరాపురం ఎస్ఐ ఇషాక్‌బాషా గాయపడిన ముగ్గురిని మడకశిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. బస్సులో 64 మంది ప్రయాణికులు ఉన్నారని, అందులో ముగ్గురికి స్వల్పగాయాలు అయ్యాయని తెలిపారు. మడకశిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన వారిని తహసీల్దార్ లక్ష్మీనరసింహ పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్‌కు సూచించారు. ఏఎస్ఐ రామాంజనేయులు, గ్రామస్తులు పాల్గొని బస్సులో నుంచి ప్రయాణికులను బయటకు దించి వారిని వారి వారి గ్రామాలకు పంపారు. డ్రైవర్, కండెక్టర్ పరారీలో ఉన్నారు.